నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

సంచిక : 221 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 23-11 -2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**
**ఆటవెలది**

ధీరులైనవారు జోరుగా పోరాడు
విజయసాధనమున విశ్వమందు
గడ్డిపరకగూడ కరవాలముగ వాడు
లక్ష్యసిద్ధియున్న లక్షణముగ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




## సేవే ధర్మం..ప్రేమే మార్గం

- తన సందేశాలతో బాబా పరివర్తన
- లక్షల మందికి తాగునీటి వసతి సౌకర్యం
- పేదలకు ఉచితంగా వైద్య సేవల కల్పన
- సాయి శతజయంతి ఉత్సవాల్లో సిఎం చంద్రబాబు

పుట్టపర్తి, -నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్): సత్యసాయి బాబా తన సందేశాలతో చాలామందిలో పరివర్తన తెచ్చారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి సమస్య లేకుండా బాబా అనేక ప్రాజెక్టులు నెలకొల్పారు. విరాళాల రూపంలో వచ్చిన నిధులను ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించారు. అనేక గ్రామాల్లో లక్షల మందికి తాగునీరు అందించారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారు. సత్యసాయి ట్రస్టుకు లక్షల మంది వాలంటీర్లు ఉన్నారు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మి సత్యసాయి ఆచరించారు. భగవాన్ సాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించింది.

-మిగతా 2 లో




# లైన్ క్లియర్

## పంచాయతీ రిజర్వేషన్లపై జీవో విడుదల

- స్థానిక ఎన్నికల్లో 50శాతం మించకుండా రిజర్వేషన్లు ఖరారు
- రొటేషన్ పద్ధతిలో ఎస్సీ ,ఎస్టీ ,బీసీ మహిళా రిజర్వేషన్లు
- 100% ఎస్టీ జనాభా ఉన్న గ్రామంలో అన్ని స్థానాలు వారికి
- ఎంపీడీవోలకు వార్డు మెంబర్ స్థానాలు...ఆర్డీవోలకు సర్పంచ్ స్థానాల ఖరారు బాధ్యతలు
- వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే విధంగా ప్రయత్నాలు



హైదరాబాద్, - -నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చకు రేవంత్ సర్కార్ తెర దింపింది. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వేషన్ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జీవో విడుదల చేసింది. పంచాయతీరాజ్ జీవో ప్రకారం రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు. 50శాతం -మిగతా 2 లో




## సత్యసాయి ఆశిస్సులతో అగ్రస్థానానికి భారత్

- సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి
- సాయి సమాధి వద్ద నివాళి అర్పించిన రాధాకృష్ణన్

పుట్టపర్తి, సత్యసాయి ఆశీస్సులతో 2047 నాటికి భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ఆశిస్తున్నట్టు ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ తెలిపారు. సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నవంబర్ 22 విశిష్టత గురించి సీఎం చెప్పగానే వస్తానని చెప్పా. ఇప్పటికే దేశంలో ముగ్గురు ప్రముఖులు పుట్టపర్తిని సందర్శించారు. సమాజ సేవ కోసం సత్యసాయిబాబా నాయకులను తయారు చేశారు. విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని లోకేశ్ ఆహ్వానించగానే అందరూ స్వాగతించారు. విద్యార్థులు దేశ నాయకులుగా ఎదుగుతారనేందుకు ఇదే నిదర్శనం. జీవితంలో ప్రతి రోజూ చాలా కీలకం. మానవ జీవితాలు యాంత్రికంగా, ఆధ్యాత్మికంగా సాగుతున్నాయి. విద్యాసంస్థ ద్వారా క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం నేర్పుతున్నారు. -మిగతా 2 లో




## ప్రపంచ సంరక్షుడిగా హిందూ సమాజం

- హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ప్రమాదం
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

ఇంఫాల్, - ప్రపంచాన్ని నిలబెట్టడంలో హిందూ సమాజం కీలకమని రాష్ట్రీ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ఉనికి ఉండదని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశం అన్ని రకాల పరిస్థితులను చూసిందని, యునాన్ (గ్రీస్) మిస్ర్ (ఈజిప్టు), రోమ్ వంటి సామ్రాజ్యాలు, నాగరికతలు కనుమరుగైనా హిందూ సమాజం చెక్కుచెదరలేదని చెప్పారు. జాతుల మధ్య ఘర్షణలతో ఇటీవల కాలంలో అట్టుడికిన మణిపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడుతూ, హిందూ సమాజం ధర్మానికి ప్రపంచ సంరక్షుడిగా ఉందన్నారు. భారత్ అంటే అమర నాగరికతకు -మిగతా 2 లో

## దేశంలో పేలుళ్లకు జైషే కుట్రలు

- ఆత్మాహుతి బాంబర్ ఉమర్‌కు నిధులు
- డాక్టర్లే నిధులు సమకూర్చారని గుర్తింపు
- ఢిల్లీ పేలుడు ఘటనపై పలు కీలక విషయాలు వెలుగులో



న్యూఢిల్లీ, ఢిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరమవుతున్న కొద్దీ పలు కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. జైషే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ దేశవ్యాప్తంగా దాడులకు 2023 నుంచి కుట్రలు పన్నుతున్నట్టు సమాచారం ఇప్పటికే వెలుగులోకి రాగా, ఢిల్లీ పేలుడు కేసులో నిందితులుగా ఉన్న డాక్టర్లే స్వయంగా సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్‌కు నిధులు సమకూర్చినట్టు తాజాగా వెలుగుచూసింది. కేసులో నిందితులైన డాక్టర్లంతా కలిసి రూ.26 లక్షలు సమకూర్చినట్టు తెలుస్తోంది. డాక్టర్ ముజమ్మిల్ రూ.5 లక్షలు, డాక్టర్ అదిల్ అహ్మద్ రాథర్ రూ.8 లక్షలు, డాక్టర్ ముఫర్ అహ్మత్ రాథర్ రూ.6 లక్షలు, డాక్టర్ ఉమర్ రూ.2 లక్షలు, డాక్టర్ షహీన్ సాహిద్ రూ.5 లక్షలు కంటిబ్యూట్ -మిగతా 2 లో

## ఈ నెల 29న దీక్షా దివస్ ఘనంగా నిర్వహించాలి.

### బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు



హైదరాబాద్, - -నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్): ఈ నెల 29న దీక్షా దివస్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. దశాబ్దంన్నర క్రితం, పార్టీ అధినేత కేసీఆర్ 'తెలంగాణ వచ్చుడో.. కెసిఆర్ సచ్చుడో' అనే గొప్ప త్యాగ నిరతితో దీక్షను చేపట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో ఘనమైన ఈ ఘట్టాన్ని పురస్కరించుకొని -మిగతా 2 లో



## మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్

- వరుస ఎన్‌కౌంటర్ల తరవాత 37మంది లొంగుబాటు
- లొంగిపోయిన వారిలో కేంద్రకమిటీ సభ్యులు ఆజాద్
- గణపతి తదితరులంతా అజ్ఞాతం వీడి రావాలన్న డిజిపి

హైదరాబాద్, - -నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్): మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. వరుస ఎన్‌కౌంటర్ల తరవాత తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, ఎకె47లు, భారీగా బులెట్స్ స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో -మిగతా 2 లో




## గుర్తు లేదు.. మర్చిపోయా..!

- పోలీసుల విచారణలో ఐబొమ్మ రవి సమాధానాలు..!
- పోలీసుల విచారణలో సహకరించని రవి
- విదేశీ సంస్థలపై సంబంధాలపై మౌనం
- మూడోరోజు ముగిసిన విచారణ

హైదరాబాద్, -నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్): సినిమాల పైరసీ కేసులో ఐ బొమ్మ ఇమంది రవి పోలీసుల విచారణ శనివారం మూడో రోజు ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో భాగంగా ఇమంది రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీశారు. పైరసీకి ఎవరు సహకారం అందిస్తున్నారు.. తెర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారనే విషయాలపై పోలీసులు ప్రశ్నించారు. సైబర్ నేరాలకు ఐ బొమ్మ సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచుకున్నట్లు

-మిగతా 2 లో




## కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం

**ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు**

### చదువుకోని అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు



- ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచించింది.
- ఆయన లేకుండా తెలంగాణ ఉద్యమసభలు లేవు
- తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో.. అంతే పోరాటాన్ని కూడా చేస్తుంది
- అందెశ్రీ సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, -నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్): తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారే ముందుండి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లారని అన్నారు. వారు లేకుంటే తెలంగాణ లేదని అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు. ఉద్యమానికి కవులు, కళాకారులు ఇచ్చిన ఊపుతోనే తెలంగాణ సాకారమైందని, ఇది ఎవరూ కాదనలేని నిజమన్నారు. అంతేగాకాకుండా -మిగతా 2 లో



## డీసీసీ అధ్యక్షులను ప్రకటించిన ఏఐసీసీ..

- హైదరాబాద్‌లో ముగ్గురు..!
- వికారాబాద్ జిల్లా అధ్యక్షునిగా దారాసింగ్
- మేడ్చల్ మల్కాజ్ గిరి వజ్రేష్ యాదవ్
- రంగారెడ్డి జిల్లా పెండింగ్ లో..

రంగారెడ్డి - -నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్): చాలా రోజులుగా పెండింగ్ లో ఉన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవులు ఎట్టకేలకు ఖరారు చేసారు. చాలాకాలంగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసినా చివరికి శనివారం రాత్రి ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్ జాబితా ప్రకటించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రంగారెడ్డి జిల్లా పెండింగ్ లోనే ఉంది. వికారాబాద్ జిల్లా అధ్యక్షునిగా సీనియర్ కాంగ్రెస్ నేత దారాసింగ్ పేరు ఖరారు చేసారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా పగ్గాలు మేడ్చల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జీ వజ్రేష్ యాదవ్ కు అప్పగించారు.

-మిగతా 2 లో

## సత్యసాయి ఆశిస్సులతో అగ్రస్థానానికి భారత్

మొదటి తరువాయి

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పే కేంద్రంగా సత్యసాయి విద్యాసంస్థ విలసిల్లుతోందని ఉప రాష్ట్రపతి అన్నారు. అంతకుముందు శ్రీ సత్యసాయి శతజయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. సత్యసాయి మహా సమాధి వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ తదితరులు ఉన్నారు. అనంతరం.. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు.వ్యక్తిత్వ కేంద్రంగా సత్యసాయి వర్సిటీ నిలుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'సత్యసాయి వర్సిటీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ప్రత్యేక ఆశయంతో సత్యసాయిబాబా భూమిపైకి వచ్చారు. సత్యసాయి.. భగవాన్ సాయి సిద్ధాంతం వ్యాప్తి చేశారు. క్రమశిక్షణ, ప్రేమ, సేవాభావం కలిగి ఉండాలని చెప్పారు. భారత్.. వేల ఏళ్లుగా ఆధ్యాత్మిక భావనలతో వర్ధిల్లుతోంది. వసుదైక కుటుంబం.. ప్రపంచమంతా ఒకే కుటుంబం అనేది మన సంస్కృతిలో ఉంది. సత్యసాయి విద్యాసంస్థ నైతికత, విలువలతో కూడి ఉంటుంది. విద్యార్థులకు ఆధ్యాత్మికత, సేవాభావాన్ని విద్యాసంస్థ నేర్పిస్తుంది. అందరినీ ప్రేమించాలి.. సేవ చేయాలి అనేది భగవాన్ సాయి సిద్ధాంతం. సహాయ గుణం కలిగి ఉండాలే కానీ, ఎవరినీ నొప్పించవద్దనేది సిద్ధాంతం. సత్యం, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు సూత్రాలు చెప్పారని సీఎం అన్నారు.

## ప్రపంచ సంరక్షుడిగా హిందూ సమాజం

మొదటి తరువాయి

పేరని, సమాజంలో అలాంటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నందునే హిందూ కమ్యూనిటీ చెక్కుచెదరకుండా ఉందని, హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచమే ఉనికి కోల్పోతుందని అన్నారు. ఇండియాలో ఉన్నవారంతా హిందువులేనని, హిందూ వారసత్వానికి చెందినవారే ముస్లింలు, క్రిస్టియన్లని చెప్పారు. దేశ పటిష్టతకు ఆర్థిక స్వావలంభన చాలా కీలకమని మోహన్ భాగవత్ అన్నారు. దేశ నిర్మాణంలో మిలటరీ సామర్థ్యం, నాలెడ్జ్ కెపాసిటీకి సమ ప్రాధాన్యత ఉందని చెప్పారు. దేశ నిర్మాణం జరగలాంటే బలం కావాలని, బలం అంటే ఆర్థిక సామర్థ్యమని చెప్పారు. ఆధిపత్యం అనే పదానికి ఒక్కోసారి విపరీత అర్థం వస్తుందన్నారు. అయితే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎవరిపైనా ఆధారపడకూడదని అన్నారు. ఇదేమంత కష్టమైన పని కూడా కాదని చెప్పారు. నక్సలిజం తగ్గుముఖం పట్టడంపై మాట్లాడుతూ, నక్సలిజాన్ని ఇంకెంత మాత్రం సహించేది లేదని సమాజం నిర్ణయించుకోవడమే ఇందుకు కారణమని అన్నారు. బ్రిటిష్ వారిపై జరిగిన స్వాతంత్య్ర పోరాటాన్ని ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. 'బ్రిటిష్ సామ్రాజ్యంలో రవి అస్తమించడు. కానీ ఇండియాలో వారి సూర్యుడు అప్పటికే అస్తమించాడు. 90 ఏళ్లపాటు ప్రయత్నాలు సాగించాం. అణచివేతకు ఎన్నడూ తలవంచలేదు. కొన్నిసార్లు మన గళం బలహీనంగా ఉండి ఉండవచ్చు, కొన్ని సార్లు బలంగా వినిపించి ఉండవచ్చు. కానీ మన గళం ఎన్నడూ మూగవోలేదు' అని మోహన్ భాగవత్ వివరించారు.

## దేశంలో పేలుళ్లక జైషే కుట్రలు

మొదటి తరువాయి

చేసినట్టు చెబుతున్నారు. పోగుచేసిన మొత్తం సొమ్మును పేలుడు సామగ్రిని సమకూర్చేందుకు డాక్టర్ ఉమర్‌కు వీరు అందజేశారని దర్యాప్తు అధికారుల సమాచారం. అమ్మోనియం నైట్రేట్, యూరియా, ఇతర కీలక సామగ్రిని డాక్టర్ ముజమ్మిల్ సేకరించాడు. రూ.3 లక్షలతో ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను కొనుగోలు చేశాడు. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఫరీదాబాదాలోని రెండు మార్కెట్ల నుంచి కొన్నాడు. ఆ ఫెర్టిలైజర్‌ను పేలుడు పదార్థాలుగా డాక్టర్ ఉమర్ మహమ్మద్ మార్చాడు. పేలుడుకు అవసరమైన రసాయనాలు, రిమోట్లు, అవసరమైన పరికరాలను సమకూర్చే బాధ్యత డాక్టర్ ఉమర్ తీసుకున్నాడు. మరోవైపు, అల్-ఫయిదా యూనివర్శిటీ వ్యవహారంపై విస్తృతంగా జరిపిన ఇన్వెస్టిగేషన్‌లో ల్యాబ్ నుంచి స్టూడెంట్ ప్రాజెక్టుల పేరుతో పలు కెమికల్స్, గ్లాస్‌వేర్ చోరీ అయినట్టు తెలుస్తోంది. అమ్మోనియం నైట్రేట్, టెస్టింగ్ కిట్లు మాయమైనట్టు గుర్తించారు. నిందితులు చిన్న చిన్న మొత్తాల్లో వీటిని బ్యాగులు, వాహనాల్లో యూనివర్శిటీ నుంచి తరలించినట్టు గుర్తించారు.

## ఈ నెల 29న దీక్షా దివస్ ఘనంగా నిర్వహించాలి.

మొదటి తరువాయి

దీక్షా దివస్‌ను పెద్ద ఎత్తున నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా అధ్యక్షులు, పార్టీ జనరల్ బాడీ సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, దీక్షా దివస్ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శనం చేశారు.దీక్షా దివస్ నిర్వహణకు ముందుగా, ఈ నెల 26వ తేదీన అన్ని జిల్లాల పార్టీ కేంద్రాల్లో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించుకోవాలని కేటీఆర్ సూచించారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు సహా ఇతర కీలక నాయకులందరినీ ఆహ్వానించాలని ఆయన ఆదేశించారు. ఈ సన్నాహక సమావేశాల ముఖ్య ఉద్దేశం, నవంబర్ 29న పార్టీ ఘనంగా నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. నవంబర్ 29న జరిగే దీక్షా దివస్ కార్యక్రమాన్ని అన్ని జిల్లా కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లోనే నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఒక రోజు ముందుగా, అంటే 28వ తేదీ సాయంత్రంలోగా జిల్లా కేంద్రాలు, పట్టణాలను బ్యానర్లు, ఫ్లెక్సీలతో అలంకరణ పూర్తి చేయాలని.. పార్టీ కార్యాలయం ప్రాంగణాన్ని కూడా సుందరంగా అలంకరించాలని సూచించారు. జిల్లాలోని ముఖ్య నాయకులందరికీ ప్రత్యేకంగా సమాచారం అందించి, కనీసం 1000 మంది కీలక పార్టీ నేతలతో ఈ సమావేశాన్ని నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.

## డీసీసీ అధ్యక్షులను ప్రకటించిన ఏఐసీసీ..

మొదటి తరువాయి

రంగారెడ్డి జిల్లాకు సంబంధించి పోటీ తీవ్రంగా ఉండటంతో పెండింగ్ లో పెట్టారు. డీసీసీ అధ్యక్ష పదవి కీలకం కానుంది. ఏ ఐసీసీ వీరికి కీలక అధికారాలు కట్టబెట్టింది. రానున్న రోజుల్లో డీ సీసీలు కీలకం కానున్నారు. అందుకే డీసీసీ నియామకాల్లో పారదర్శకతను పాటించారు. ఢిల్లీ నుంచి దూతలను పంపి అందరి అభిప్రాయాలను తెలుసుకొని అందులో ఆరుగురి పేర్లు హస్తిన పెద్దలకు పంపించారు. అందులో ఫిల్టర్ చేసి చివరికి ముగ్గురి పేర్లు ఫైనల్ జాబితాలో చేర్చారు. మొత్తం మీద డీసీసీ అధ్యక్షుల పేర్లు ఖరారు చేసారు

# లైన్ క్లియర్

మొదటి తరువాయి

రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ , ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం బీసీలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి. ఇదిలావుంటే వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలు, భద్రతా చర్యలు, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సమావేశంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈసీ చర్యలు అధికార యంత్రాంగాన్ని ఉత్సాహపరుస్తున్నాయి. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ రాణి కుమిదిని, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతల నిర్వహణ సులభతరం చేయడానికి ప్రతి జిల్లాలో ఎన్నికలను మూడు దఫాలుగా నిర్వహించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా ఒక ప్రాంతంలోని ఎన్నికలు పూర్తయిన తర్వాత, మరొక ప్రాంతంలో ఎన్నికలకు మధ్యలో రెండు రోజుల విరామం ఉండాలని డీజీపీ అభిప్రాయపడ్డారు. ఈ విరామం వలన సిబ్బందికి, భద్రతా బలగాలకు తగిన సమయం లభిస్తుందని, బందోబస్తు నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన రోజు ఫలితాలు సాయంత్రం ప్రకటిస్తున్న నేపథ్యంలో ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉన్నందున రెండు రోజుల విరామం అవసరమని స్పష్టం చేశారు.

# సేవే ధర్మం..ప్రేమే మార్గం

మొదటి తరువాయి

దాన్ని మనమంతా అర్థం చేసుకోవాలని చంద్రబాబు అన్నారు. లవ్ ఆల్.. సర్వ్ ఆల్, ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలని... ఎవ్వరినీ నొప్పించకూడదు అనేది సత్యసాయి బాబా సిద్ధాంతమని చంద్రబాబు నాయుడు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనే ఈ ఐదు సూత్రాలను సత్యసాయి బాబా చెప్పేవారని గుర్తు చేశారు. సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు.. సూత్రాలను పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుందన్నారు. ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారన్నారు. కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు... పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి తాగు నీటి ప్రాజెక్టులకు నిధులను సమకూర్చారని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. ఇప్పటికీ అదే స్ఫూర్తిని సత్యసాయి బాబా భక్తులు



కొనసాగించడం తనకు సంతోషాన్ని ఇస్తోందన్నారు. సత్యసాయి బాబాతో తనకు మంచి అనుబంధం ఉందని సీఎం గుర్తుచేశారు. వివిధ ప్రాణాంతక రోగాల బారిన పడిన వారిని సత్యసాయి బాబా ట్రస్టు ఆదుకుంటోందని సీఎం పేర్కొన్నారు. మానవ సేవే... మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని సత్యసాయి బాబా ట్రస్టు అమలు చేసి చూపిస్తోందన్నారు. శాంతికి బ్రాండ్ అంబాసిడర్ లాగా సత్యసాయి బాబా నిలుస్తారని చెప్పుకొచ్చారు. 7.50 లక్షల మంది వాలంటీర్లు సత్యసాయి బాబా ట్రస్టు ద్వారా సేవలందించారని... ఏ వ్యవస్థకు ఇంతటి శక్తి లేదన్నారు. ఇవాళ సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఏమైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవలందిస్తారన్నారు. ధనవంతులు, పెద్ద ఉన్నతాధికారుల కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రశాంతి నిలయానికి పంపి సేవా కార్యక్రమాలు చేయిస్తారన్నారు. 140 దేశాల్లో 2 వేలకు పైగా బ్రాంచ్‌లు సత్యసాయి బాబా ట్రస్టుకు ఉన్నాయన్నారు. భగవాన్ సత్యసాయి బాబా భక్తులు శాంతికి అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రపతి ముర్ము జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం

మొదటి తరువాయి

వారే తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని మోసారని అన్నారు.. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. బడికి వెళ్ళని అందె శ్రీ రాసిన జయ జయ హే తెలంగాణ గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది అని రేవంత్ తెలిపారు. బాధతో.. ఉద్వేగంతో చెప్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారు. ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచింది.. తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా గత పాలకుల చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు.అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని గుర్తు చేశారు. ఊరూరా పాటలతో అందెశ్రీ ఉద్యమానికి ఊపిరిలూదారని అన్నారు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. ఆయనను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాలకుల దృష్టిలో పదేళ్లు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచిందన్నారు. . తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం ఆనాడు జరిగిందన్నారు. కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారని సిఎం రేవంత్ అన్నారు. ప్రజలు కోరుకున్న జయ జయహే తెలంగాణను.. రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా.. ప్రతి బడిలో పాడాలి, పాఠ్య పుస్తకాల్లో రాయాలని ప్రజా ప్రభుత్వం




నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో.. అంత చైతన్యవంతులని తెలంగాణ ఉద్యమమే రుజువు చేసిందన్నారు.ఈ గడ్డ మీద ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని, అందుకు నడుస్తున్న చరిత్రే సాక్షాత్కారమని అన్నారు. ఎన్ని వజ్రాలు ఉన్నా.. కోహినూరు వజ్రం ప్రత్యేకం. అలాగే ఎందరు కవులు ఉన్నా.. డా.అందెశ్రీ ప్రత్యేకంఅని సీఎం అన్నారు. తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో.. అంతే పోరాటాన్ని కూడా చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు, కవులు, కళాకారులూ ఎన్నో పోరాటాలు చేశారు.. గతంలో నిజాం సర్కార్ వాళ్ళను సైతం ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణకు ఉందని సీఎం చెప్పారు. గద్దర్, గోరేటి వెంకన్న వంటి ఉద్యమకారులు తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని రూపకల్పన చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం జయ జయ హే తెలంగాణ పాటను ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రావాలని అందె శ్రీ, గద్దర్ అన్న లాంటి వాళ్ళ స్ఫూర్తి తోనే ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 9 మంది ఉద్యమ కారులను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కారులది. దేశంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. వర్గీకరణ అనేది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.. అలాగే సమాజాన్ని ముందుకు నడిపించాలానే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రమంత్రి వర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం అనేది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే నిర్ణయాలు తీసుకున్నాం.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రనిదే అసలైన గొప్పతనం.. అలాగే కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న.. కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటం వద్ద అందరూ నివాళి అర్పించారు. జయజయహేతో సభ మార్మోగింది. అందెశ్రీ అమర్ రహే అన్న నినాదాలు మిన్నంటాయి.

## మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్

మొదటి తరువాయి

ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం అని తెలిపారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తాం. మిగతావాళ్లు కూడా తొందరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అన్నారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణెళిశ్,బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు.

## గుర్తు లేదు.. మర్చిపోయా..!

మొదటి తరువాయి

పోలీసులు అనుమానిస్తున్నారు. సినిమాల సేకరణ, సైట్‌లో అప్‌లోడ్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. అయితే, విచారణలో పోలీసులకు రవి సహకరించడం లేదని సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు




చెబుతున్నాడని తెలిసింది. యూజర్ ఐడీ, పాస్‌వర్డులు అడిగితే గుర్తు లేదు.. మరిచిపోయానని రవి సమాధానం చెప్పినట్లు సమాచారం. ఎథికల్ హ్యాకర్ల సహాయంతో హార్డ్‌డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లను పోలీసులు ఓపెన్ చేస్తున్నారు. ఫ్రాన్స్, నెదర్లాండ్‌లో మెయిన్ సర్వర్లు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. బ్యాంక్ ఖాతాల విషయంలోనూ రవి నోరువిప్పలేదని.. రవి అకౌంట్ల వివరాలు ఇవ్వాలని పలు బ్యాంకులకు పోలీసులు మెయిల్ పంపారు. ప్రతీరోజూ 20 రోజులకు ఒక్కో దేశానికి రవి వెళ్లాడని.. దీనిపై ప్రశ్నిస్తే తనకు విదేశీ పర్యటనలంటే ఇష్టమని.. అందుకే వెళ్లాలని రవి చెప్పినట్లు తెలియవచ్చింది. రవి పర్యటించిన దేశాల్లో పైరసీ లింకుల కూపీ లాగుతున్నారు పోలీసులు.

# సంఘ్ శతాబ్ది గృహ సంపర్క ప్రచారంలో పాల్గొన్న ఆచారి

**ఆమనగల్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ పట్టణంలో సంఘ్ శతాబ్ది గృహ సంపర్క ప్రచారాన్ని బిజెపి నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు శ్రీ తల్లోజు ఆచారి ప్రారంభించారు. సంఘ్ తన శతాబ్ది సంవత్సరంలో 30 కోట్ల కుటుంబాలను కలుసుకోవాలని సంకల్పించింది. నవంబర్ 16 నుండి స్వచ్ఛంద సేవకులు ఇంటింటికీ వెళ్లి సంఘ్ 100 ఏళ్ల ప్రయాణాన్ని పరిచయం చేస్తున్నారు. 1925వ సంవత్సరం విజయదశమి పర్వదినాన డాక్టర్ కేశవ బలిరామ్ హెడ్గేవార్ స్థాపించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక సంస్థగా ఎదిగింది. స్వాతంత్ర్య పోరాటంలో రెండు సార్లు జైలుకు వెళ్లిన హెడ్గేవార్, హిందూ సమాజాన్ని ఐక్యం చేయాలనే సంకల్పంతో



సంఘాన్ని ప్రారంభించారు. కులం, భాష, ప్రాంతం, వేషభూషణం వంటి విభిన్నతల మధ్య ఐక్యతను సాధించడమే ఆయన లక్ష్యం. హిందుత్వాన్ని మతంగా కాకుండా జీవన విధానంగా నిర్వచిస్తూ, సమాజాన్ని సంఘటితం చేయాలనే ఆలోచనతో ఆయన ఈ మహత్తర యజ్ఞాన్ని ప్రారంభించారు. సంఘ్ వ్యక్తినిర్మాణానికి ప్రత్యేకమైన పద్ధతిని అవలంబించింది. దైనందిన శాఖల ద్వారా ఆటలు, వ్యాయామం, యోగాసనాలు, సూర్యనమస్కారాలు, దేశభక్తి గీతాలు, కథలు, భారతమాత ప్రార్థనలు నిర్వహిస్తూ స్వయంసేవకుల్లో ధైర్యం, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి వంటి సద్గుణాలను పెంపొందిస్తోంది. ఈ సాధారణమైన కార్యక్రమాలే స్వయంసేవకుల జీవిత దిశను మార్చి, సంఘాన్ని అసాధారణ సంస్థగా నిలబెట్టాయి. సంఘ్ శతాబ్ది ఉత్సవాలు కేవలం ఒక జ్ఞాపకోత్సవం కాదు, సమర్థ భారత నిర్మాణానికి పునరంకితమైన సంకల్పం. హైందవ చైతన్యమే జగతికి శ్రీరామ రక్ష అని విశ్వాసంతో, స్వయంసేవకులు సమాజ సేవలో ముందుకు సాగుతున్నారు.

# పుస్తక పఠనం జీవితాలను మార్చేస్తుంది

**చొప్పదండి, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: జిల్లా విద్యాశాఖ అధికారి మొండయ్య మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను మార్చగల శక్తి పుస్తక పఠనంలోనే ఉందని స్పష్టం చేశారు. చిన్ననాటి లో ఒక స్వచ్ఛంద సంస్థ అందించిన పుస్తకం ద్వారానే తాను ప్రతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించి ఈ స్థాయికి ఎదిగానని ఆయన గుర్తుచేశారు. నలుమాసు లింగయ్య శివలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాగంపేట, చొప్పదండి మండలంలో జరిగిన మ్యాథమెటికల్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు మ్యాథ్స్ ఫండమెంటల్ బుక్ అందించడం శుభపరిణామమని, ఈ పుస్తకం డిగ్రీ వరకు కూడా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీ అశోక్ రెడ్డి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి మంచి ఫలితాలు సాధించాలని సూచించగా, జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శ్రీ నలుమాసు సుదర్శనం ఇదే పాఠశాలలో విద్య అభ్యసించి సమాజానికి ఇచ్చే స్థాయికి ఎదిగామని, మీరు కూడా ఆ స్థాయికి చేరుకోవాలని ప్రేరేపించారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు మరియు



మండల విద్యాధికారి శ్రీ నలుమాసు హరి ప్రసాద్ గణితం జీవితంలో స్థిరపడటానికి కీలకమని, గణితంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తే భవిష్యత్తు సులభమని వివరించారు. చొప్పదండి మండల విద్యాధికారి శ్రీ పి. మోహన్ విద్యార్థుల హాజరును ప్రోత్సహించడానికి అత్యధిక హాజరు కలిగిన వారికి నగదు పారితోషకం అందించడం ద్వారా ప్రేరణ కల్పిస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి శ్రీ కమటాల రామ్మోహన్ ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు ఎల్లప్పుడూ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ నలుమాసు రాజేశం స్వగ్రామం మీద అభిమానంతో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు అరుణ్ పదవ తరగతి తర్వాత రాయవచ్చే పరీక్షల గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినకర్ స్వచ్ఛంద సంస్థ అందించిన మెటీరియల్‌ను పూర్తిస్థాయిలో వినియోగించేందుకు కృషి చేస్తామని తెలియజేస్తూ ట్రస్ట్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వేణుగోపాల్, గణేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బహదూర్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం

**కుత్బుల్లాపూర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో, బీకేఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి డబుల్ బెడ్‌రూమ్ సమీపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఇలాంటి శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తేవడమే తన లక్ష్యమని తెలిపారు. ముందస్తు ఆరోగ్య పరీక్షల ద్వారా వ్యాధులను సకాలంలో గుర్తించి చికిత్స



పొందే అవకాశం కలుగుతుందని ఆయన గుర్తుచేశారు. గ్రామీణ ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో అనేక మంది ప్రజలు పరీక్షలు చేయించుకుని ఉచిత మందులు పొందారు. అనంతరం మమత అకాడమీ వైద్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన కిషోర్ రెడ్డి, నియోజకవర్గ ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ సర్పంచ్ బండ నరసింహ, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సాదు యాదవ్, మాజీ సర్పంచ్ కావాలి గణేష్ వేణు, దుడ్డు నర్సింగ్ రావు, రంగయ్య, రచ్చ నాయక్, శ్రీనివాస్ చారి, కృష్ణవేణి బృందం నరసింహారెడ్డి, శ్రీశైలం యాదవ్, పృధ్వి, కాలనీ వాసులు, గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భారత్‌ను విశ్వ గురువుగా నిలిపే మహా యజ్ఞంలో భాగస్వామ్యం కావాలి

## బూర్ల దక్షిణామూర్తి

**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జన్మ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈనెల 23వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ఇంటింటి జనజాగరణ కార్యక్రమాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చేపట్టింది. రామచంద్రపూర్ కాలనీలో హనుమాన్ ఆలయంలో కరపత్రాలు, స్టిక్కర్లు పూజల అనంతరం ఆవిష్కరించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రాంత కార్యకారిణి సభ్యుడు బూర్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ, డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్



స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్ నేటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక సేవా సంస్థగా ఎదిగిందని తెలిపారు. హిందుత్వం మతం కాదు, జీవన విధానం అని, వ్యక్తి నిర్మాణమే దేశ నిర్మాణమని, సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, స్వాధారిత జీవనం, పౌరవిధుల ఆచరణ, కుటుంబ ప్రబోధన్ వంటి అంశాలతో సమాజ వికాసం దిశగా సంఘం ముందుకు వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్ భారతీయ సాంస్కృతిక వికాసానికి, ధర్మ పరిరక్షణకు అహర్నిశలు కృషి చేస్తుందని, వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, గాజుల రవీందర్, కొత్త మహేందర్ రెడ్డి, బద్దం రవీందర్ రెడ్డి, దేవసాని రమేష్, సార శ్రీనివాస్, స్వరాట్, లక్ష్మీపతి, సిహెచ్. శ్రీనివాస్, కుమార్, కొమురయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కృషి సమాజ అభివృద్ధికి పునాది

- పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో ఈరోజు గవర్నమెంట్ హై స్కూల్ మరియు గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్‌లో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు నేషనల్ మెయిన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ ప్రిపరేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాపిశెట్టి రాము విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, కృషి, పట్టుదలతో చదివి స్కాలర్షిప్ సీటు సాధించాలని సూచించారు. హై స్కూల్‌లో కృష్ణయ్య సార్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించగా, గర్ల్స్ హై స్కూల్‌లో ప్రిన్సిపల్ రమాలక్ష్మి మేడం మరియు ఉపాధ్యాయులు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో సేవా సభ్యులు పాత్లావత్ శ్రీను నాయక్ తదితరులు కూడా పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగకరమని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

# దొమ్మర పోచంపల్లిలో మున్సిపల్ షాపుల లక్కీ డ్రా



**దుండిగల్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దుండిగల్ మున్సిపల్ పరిధిలోని దొమ్మర పోచంపల్లి, మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న ఆరు షాపుల కేటాయింపుకు ఈరోజు (22 నవంబర్ 2025) ఉదయం 11 గంటలకు లక్కీ డ్రా నిర్వహించారు. గౌరవ మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్ నాయక్ గారు, రెవిన్యూ ఆఫీసర్ వి. నాగేష్ బాబు, దరఖాస్తుదారులు మరియు కార్యాలయ సిబ్బంది సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. మొత్తం 61 మంది దరఖాస్తుదారులు పాల్గొన్న ఈ లక్కీ డ్రా ద్వారా మూడు సంవత్సరాల కాలపరిమితితో షాపులు కేటాయించబడ్డాయి. మున్సిపల్ చట్టం ప్రకారం నియమ నిబంధనలకు లోబడి పాల్గొనాలని అధికారులు సూచించారు. ఈ లక్కీ డ్రాలో విజేతలుగా షాప్ నెంబర్ 1 – తప్పట్ల భాస్కర్, షాప్ నెంబర్ 2 –గూడా వెంకటేష్, షాప్ నెంబర్ 3 – కే. లీలావతి, షాప్ నెంబర్ 4 – పుప్పాల సందీప్, షాప్ నెంబర్ 5 – మాయ ప్రియాంక, షాప్ నెంబర్ 6 – మద్దెల జీతయ్య గౌడ్ ఎంపికయ్యారు.

# బాల్యవివాహాల నిర్మూలన సమాజ అభివృద్ధికి తొలి అడుగు.



**ఎలిగేడు, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు గ్రామ సమైక్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో అంగన్వాడీ టీచర్లు కే. జ్యోతి, బి. సరోజ, సరస్వతి బాల్యవివాహాలపై తీవ్రంగా స్పందించారు. పెళ్లి వయసు లేని పిల్లలకు వివాహాలు జరపడం వల్ల కలిగే కష్టాలు, అనర్థాలను వివరించి, సమాజం ఈ అనారోగ్యకరమైన ఆచారాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న మహిళలకు బాల్యవివాహాలను అరికట్టే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వివోఏ కౌసల్యతో పాటు గ్రామ మహిళలు కూడా చురుకుగా పాల్గొన్నారు.

# మండల స్థాయి చెక్ ముకి టాలెంట్ టెస్ట్

**జిల్లా స్థాయి కి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక.**






**దేవరకొండ నవంబర్ 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా డిండి మండలం లో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చెక్ ముకి సంబరాలలో భాగంగా మండల స్థాయి టాలెంట్ టెస్ట్ జే.వి.వి.మండల బాధ్యులు రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.రెసిడేన్షియల్ విభాగం నుండి ప్రథమ స్థానంలో మండల స్థాయి లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల విద్యార్థులు.కే.భగవంత్,పి.దేవప్రియ,పి.వర్షిత ఎంపికైనారు.జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విభాగంలో తవక్లాపూర్ విద్యార్థులు, డిండి తెలుగు మీడియం విద్యార్థులు ఎంపికైనారు.ఈ సందర్భంగా మండల బాధ్యులు రామారావు మాట్లాడుతూ ఇలాంటి పరీక్ష పోటీలు విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించే దిశగా ఉంటాయని పేర్కొన్నారు.ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి లో ఈ నిర్వహించే టాలెంట్ టెస్ట్ కు హాజరు కానున్నారు.విద్యార్థులకు ప్రశంస పత్రం అందజేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్ మాస్టర్ గీతాంజలి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, సత్యనారాయణ,యాదయ్య, శ్రీనివాస్, రామారావు, స్వర్ణలత,పూర్ణరాం, చెన్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు కోసం అసెంబ్లీలో చర్చకు వినతి



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కరీంనగర్‌లో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కన్న కృష్ణ, జిల్లా యువజన అధ్యక్షులు జీడిగె సాయి, పట్టణ సంఘం ఉపాధ్యక్షులు బొడ్ల శ్రీరాములు, దేవి శెట్టి నవీన్ మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించారు.సన్మాన కార్యక్రమంలో జిల్లా యువజన సంఘం అధ్యక్షులు జీడిగె సాయి మాట్లాడుతూ, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు వంద కోట్లు నిధులు కేటాయించాలని, రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి నిధుల కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

## రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి స్థల పరిశీలనలో ఎంపీ ఆగ్రహం



**రామగుండం, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)** పెద్దపల్లి జిల్లా రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని నవంబర్ 22న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరిశీలించారు. అయితే ఆయన పర్యటనకు అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఎంపీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వెలుతురు లేకపోవడంతో సెల్‌ఫోన్ లైట్ల సహాయంతో స్థలాన్ని పరిశీలించాల్సి వచ్చింది.గత సంవత్సరకాలంగా కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సూక్ మాండవీయతో జరిగిన చర్చల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణానికి స్థలాన్ని కేటాయించింది. ఈ క్రమంలో ఎంపీ వంశీకృష్ణ స్వయంగా స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చారు. కానీ అధికారుల నిర్లక్ష్య ధోరణి ఆయనను ఆగ్రహానికి గురి చేసింది.ఎంపీని అవమానపరిచారని ఆరోపిస్తూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీతో పాటు, ఈఎస్ఐ అధికారులపై కూడా కార్యకర్తలు నినాదాలు చేశారు.ఎన్ని అడ్డంకులు వచ్చినా కార్మికుల సౌకర్యం కోసం ఆసుపత్రిని తీసుకువస్తానని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**-మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ ధ్యేయం**

**-ఎమ్మెల్యే బాలు నాయక్.**



**దేవరకొండ నవంబర్ 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** తెలంగాణ గాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం దేవరకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ శాసన సభ్యులునేనావత్ బాలునాయక్ హాజరై, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధుల సమక్షంలో అర్హత కలిగిన మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు. మహిళా సాధికారతే తెలంగాణ ప్రగతి అనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడానికి, కుటుంబ ఆర్థిక శ్రేయస్సును బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అందులో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగు అని ఆయన తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి మంది మహిళలకు ఉచితంగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.దేవరకొండ నియోజకవర్గంలో 68,000కు పైగా చీరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రతి గ్రామ పంచాయతీ, మండల కేంద్రం, మున్సిపాలిటీ కార్యాలయాల్లో నియోజకవర్గంలోని అర్హత కలిగిన ప్రతి మహిళకు చీరలు అందజేయబడతాయని ఆయన తెలిపారు.ఈ చీరలను రాజన్న సిరిసిల్ల హ్యాండ్‌లూమ్ నూలు రంగంలోనే తయారు చేయించడం వల్ల వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.తెలంగాణ చేనేత వృత్తి నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో అభినందనీయం అని ఆయన పేర్కొన్నారు.చీరల పంపిణీ సమయంలో ప్రతి మహిళా లబ్ధిదారుల వివరాలు నమోదు చేసి, భవిష్యత్ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తామని తెలిపారు. ఇది మహిళలకు మరిన్ని పథకాల ప్రయోజనాలు అందేలా చేస్తుందని ఆయన అన్నారు. ఇందిరమ్మ చీరలు తెలంగాణ సంస్కృతికి చిహ్నమని, ఈ కార్యక్రమం ద్వారా మహిళల గౌరవం, సాంస్కృతిక గుర్తింపు మరింత వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, మహిళాశక్తి కార్యక్రమాలు, గృహలక్ష్మి వంటి పథకాలతో ప్రజా ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణా రెడ్డి, ఎంపీడీవో లు డానియల్, చంద్రమౌళి, ఎమ్మార్వో మధుసూదన్ రెడ్డి, పార్లమెంట్ కో- ఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, శిరందాసు లక్ష్మమ్మ కృష్ణయ్య, హనుమత్ వెంకటేష్ గౌడ్, డిపిఎం విజయలక్ష్మి,నాగలీల,పురుషోత్తం, విజయ్ కుమార్, ఎపిఎం లు మాతంగి కలమ్మ, కర్ణకంటి సరస్వతి, జ్యోతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు కొర్ర గౌతమి, రాంసింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ జూనియర్ సివిల్ కోర్టు తరలింపు నిర్ణయాన్ని విరమించాలి

**-బీజేపీ డిమాండ్**



**హుస్నాబాద్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)** హుస్నాబాద్ పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టును ప్రస్తుత స్థలం నుంచి మండలంలోని అటవీ ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వం ప్రతిపాదించిన నేపథ్యంలో, కోర్టు తరలింపు నిర్ణయాన్ని విరమించుకోవాలని బీజేపీ నాయకులు గట్టిగా డిమాండ్ చేశారు.ఈ రోజు హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, పార్టీ నాయకులతో కలిసి ఆర్డీవో కార్యాలయ ఏఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టు ప్రస్తుత స్థలం 1.33 గుంటల విస్తీర్ణంలో ఉండి ప్రజలకు సులభంగా అందుబాటులో ఉందని, ఇక్కడే అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. కొత్తగా సబ్ కోర్టు మంజూరైన సందర్భంలో కూడా ఇదే స్థలంలో అద్భుతమైన నిర్మాణం చేపట్టవచ్చని సూచించారు.కోర్టును అటవీ ప్రాంతానికి తరలిస్తే న్యాయవాదులు, ప్రజలు, కక్షిదారులు రవాణా సౌకర్యాల లోపం, వ్యయప్రయాసలు, దూరభారం వంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సిద్ధిపేట జిల్లా కోర్టు 27 గుంటల స్థలంలో, హుజూరాబాద్ కోర్టు 30 గుంటల స్థలంలో పట్టణ నడిబొడ్డున ఉండి అద్భుతమైన అభివృద్ధి సాధించాయని ఉదాహరణగా చూపుతూ, హుస్నాబాద్ కోర్టును కూడా ప్రస్తుత స్థలంలోనే కొనసాగించాలని బీజేపీ పట్టణ పార్టీ డిమాండ్ చేసింది.ప్రజా అభిప్రాయం, అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోర్టు తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ మండల మాజీ అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారీ, కార్యదర్శులు వడ్డెపల్లి లక్ష్మయ్య, అకోజు అరుణ్ కుమార్, బొప్పిశెట్టి సాయిరామ్, కోశాధికారి బుర్ర రాజు, సీనియర్ నాయకులు వరియోగుల అనంతస్వామి, ఆశాడపు శ్రీనివాస్, నారోజు నరేష్, లకవాత్ శారద, బీసా శ్రీకాంత్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నవజ్యోతి హైస్కూల్లో ఘనంగా ఆలుమ్ని మీట్



**చింతల్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్** : చింతల్ డివిజన్ ఐడిపిఎల్ చౌరస్తాలోని నవజ్యోతి హైస్కూల్‌లో 1985 – 2015 మధ్య చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ ఆలుమ్ని మీట్ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయులతో అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ, పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, విద్యార్థులు తమ తమ రంగాలలో సాధించిన అనుభవాన్ని పంచుకోవడం ద్వారా పాఠశాలకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావచ్చని అన్నారు.కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఇందిరా మలిరెడ్డి, వ్యవస్థాపకులు రవీందర్ రెడ్డి బొమ్మారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణారెడ్డి మలిరెడ్డి, ప్రిన్సిపాల్ రూపాంజలి బొమ్మరెడ్డి, అకాడమిక్ ఇంచార్జ్ రామిరెడ్డి, శ్రేయోభిలాషి శాస్త్రి, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు జల్దా లక్ష్మీనాథ్, క్రాంతి యాదవ్, కార్తీక్ గౌడ్, బంటి, బాలు నేత, ఇర్ఫాన్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే ప్రథమ లక్ష్యం

**- సీపీ గౌష్ ఆలం**



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్‌ను రోడ్డు ప్రమాద రహిత నగరంగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ తెలిపారు. వాగీశ్వరీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని, రోడ్డు ప్రమాదాలు ఎందుకు జరుగుతాయి, వాటిని ఎలా నివారించాలి అనే అంశాలపై విద్యార్థులకు, సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. యువత ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని ఆయన సూచించారు.ప్రమాదాల నివారణలో భాగంగా కమిషనర్ ఇటీవల రాజీవ్ రహదారి, రేణికుంట, నుస్తులాపూర్, కొత్తపల్లి, అల్గునూరు ప్రాంతాలను విస్తృతంగా పర్యటించారు. గతంలో ప్రాణనష్టం జరిగిన బ్లాక్ స్పాట్లను స్వయంగా పరిశీలించి, ప్రమాదాలకు కారణమైన సాంకేతిక అంశాలను విశ్లేషించారు. తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ, భవిష్యత్తులో ప్రమాదాలు పునరావృతం కాకుండా తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, తిమ్మాపూర్ ఇన్స్పెక్టర్ సదన్ కుమార్, ఎల్.ఎం.డి. ఎస్సై శ్రీకాంత్, గన్నేరువరం ఎస్సై నరేందర్ రెడ్డి, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 60 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నిధుల చెక్కులను మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అందజేశారు. మొత్తం 15 లక్షల 6 వేల రూపాయల విలువ గల చెక్కులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు.ప్రజల అవసరాలను తీర్చడంలో సీఎంఆర్ఎఫ్ నిధులు కీలక పాత్ర పోషిస్తున్నాయని, లబ్ధిదారులకు ఈ సహాయం ఉపశమనాన్ని కలిగిస్తుందని కమలాకర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# ప్రజా ఆరోగ్య పరిరక్షణే

**- వైద్య శాఖ ప్రధాన లక్ష్యం.**



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓ ఎమ్హెచ్ఎన్ డాక్టర్ సన జవేరియాతో కలిసి బుట్టి రాజారామ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, అవుట్‌పేషెంట్ రిజిస్టర్‌తో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును ఏఎన్ఎం వారీగా సమీక్షించి, ఆరోగ్య కార్యక్రమాల అమలు స్థితిని పరిశీలించారు. ఎన్‌సిడీ క్లినిక్‌లో అసంక్రామిత వ్యాధుల బ్లూ, రెడ్ రిజిస్టర్‌లను పరిశీలించి, అధిక రక్తపోటు మరియు షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులు అందించే విధానాన్ని గమనించారు.ఫార్మసీ స్టోర్స్‌లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించగా, పిల్లల వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్‌లో రోజువారీ టెంపరేచర్ రికార్డులను కూడా తనిఖీ చేశారు. ఐఇసి బోర్డుపై ప్రదర్శించిన అధిక రక్తపోటు, షుగర్ మందుల వివరాలను పరిశీలించారు.మహిళల ఆరోగ్య క్యాంపుల్లో రీస్క్రీనింగ్ 100% పూర్తి చేయాలని, రిఫరల్ కేసులను ఫాలోఅప్ చేస్తూ వారికి అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పద్మజ, సూపర్వైజర్ విజయలక్ష్మి, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ధర్నాలకు పిలుపు




**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్‌లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక–రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న కలెక్టరేట్ ముందు జరగబోయే ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని, రైతాంగానికి గిట్టుబాటు ధర లేకుండా సబ్సిడీలను తగ్గించి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి కోట్లాది ప్రజల జాబు కార్డులను తొలగించడం పేదలకు దెబ్బతీసిందని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా పోరాడి బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎలిగేడు రోడ్డు నాణ్యతపై పరిశీలన



**ఎలిగేడు, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి లాలపల్లి గ్రామం వరకు 2 కోట్ల 40 లక్షల రూపాయల అంచనాతో నిర్మించిన రోడ్డు నాణ్యతపై పంచాయతీరాజ్ ఎస్ఈ చక్రవర్తి శనివారం పరిశీలన చేపట్టారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందిస్తూ రోడ్డు వెడల్పు, పొడవు, లోతు వంటి అంశాలను కొలతలు తీసి పరిశీలించారు. బీటీ రోడ్డు ఎన్ని ఇంచుల లోతు వరకు వేసారో కూడా తనిఖీ చేశారు. ఈ వివరాలతో కూడిన నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.గ్రామస్తులు తెలిపిన అభ్యంతరాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో డిపిఆర్ఈఈ గిరీష్ బాబు, డిప్యూటీ ఈఈ రాజమౌళి, ఏఈ పవన్ ఆయనతో పాటు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమల సత్తా చాటాలి

**- కడారి అయిలన్న**



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ కలెక్టరేట్ వద్ద జరిగిన సమావేశంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి అయిలన్న మాట్లాడుతూ, తెలంగాణలో అత్యధిక జనాభా గల కురుమలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి స్థాయిలో పోటీకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.వార్డ్ మెంబర్, సర్పంచ్, ఎం.పి.టి.సి., జడ్పిటిసి, ఎం.పి.పి. వరకు అవకాశం ఉన్న ప్రతి గ్రామం, ప్రతి మండలంలో కురుమలు తమ శక్తిని ప్రదర్శించాలని ఆయన సూచించారు. గతంలో రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబడి ఉన్న కురుమలు నేడు యువతతో అన్ని రంగాల్లో సమానంగా ముందుకు వెళు_న్నారని పేర్కొన్నారు.ప్రభుత్వానికి చెల్లిస్తున్న పన్నుల వాటాను కుల పరంగా, వృత్తి పరంగా సాధించుకోవాలంటే రాజకీయ పదవులు కీలకమని అయిలన్న అన్నారు. కులవృత్తి అయిన గొర్రెల పెంపకం సరియైన వసతులు లేక క్షీణిస్తున్నందున, యువత వృత్తికి దూరమవుతున్నారని, అందువల్ల అన్ని రంగాల్లో ముందుకు వెళ్లి సత్తా చాటాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# గొర్రెల పెంపకందారుల యూనియన్‌పై తప్పుడు ప్రచారం

**- జిల్లా అధ్యక్షుల ఆగ్రహం**



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ మహాసభలో ప్రభుత్వ పశుసంవర్ధకశాఖ అధికారి ఆధ్వర్యంలో 12 మందిని చీఫ్ ప్రమోటర్ మరియు ప్రమోటర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే వీరు తమను చైర్మన్, డైరెక్టర్లు అని ప్రెస్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకోవడం జిల్లా అధ్యక్షుల ఆగ్రహానికి కారణమైంది.ఆ రోజు అధికారులే స్పష్టంగా, ఇది తాత్కాలిక (అడహక్) కమిటీ మాత్రమేనని, డిసెంబర్ 2025లో పూర్తిస్థాయి ఎన్నికలు నిర్వహిస్తామని వివరించినప్పటికీ, తప్పుడు ప్రచారం వలన గ్రామాల అధ్యక్షులు అయోమయంలో పడుతున్నారని జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్య యాదవ్ తెలిపారు.జిల్లా అధికారులు ప్రెస్ ద్వారా స్పష్టమైన వివరణ ఇచ్చి సభ్యులందరికీ నిజమైన సమాచారం చేరేలా చూడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సందబోయిన ప్రసాద్ యాదవ్, బోయిని పోచమల్లు యాదవ్, శంకర్ యాదవ్, పరశురాముల యాదవ్, నాగరాజు యాదవ్ తదితర సహకార సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో జాగృతి బలోపేతమే లక్ష్యం



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా జాగృతి ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి జాగృతి పనిచేస్తుందని, ఇప్పుడు ఉన్న రాజకీయ పార్టీలకు దీటుగా జాగృతి నిర్మాణం జరుగుతోందని తెలిపారు.జిల్లాలో అన్ని మండల కమిటీలను త్వరలోనే పూర్తి చేస్తామని, ఇందుకోసం మండలాల వారీగా ఇంచార్జ్‌లను నియమించామని ఆయన పేర్కొన్నారు. మండల ఇంచార్జ్‌లు తమ ప్రాంతాల్లో పాత, కొత్త నాయకులను కలుపుకొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని జిల్లా జాగృతికి నివేదించాలని సూచించారు.గ్రామాల్లో తెలంగాణ ఉద్యమకారులు, కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావులు, మహిళలు, విద్యార్థులు, యువకులను కలుపుకొని జాగృతి బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంచి కమిటీలను ఎన్నుకోవడం, వాటి ద్వారా సమాజానికి సేవ చేయడం ఇప్పుడు మండల ఇంచార్జ్‌ల బాధ్యతగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది

**- పెద్దపల్లి ఎమ్మెల్యే**



**ఓదెల, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దపల్లి నియోజకవర్గంలోని ఓదెల మండలం మడక గ్రామంలో 42 ఆర్ కెనాల్ నుండి పోత్కపల్లి పరిసర ప్రాంతాలకు సాగునీరు చేరేలా కాలువ పనులను రైతుల సహకారంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు రైతులతో, కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని, రైతన్నలకు సాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించక ఇబ్బందులకు గురి చేసిందని, పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వెళ్లినప్పుడు వడ్ల కటింగ్ పేరిట రైతుల నడ్డి విరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్ల కటింగ్ రద్దు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు.కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం అని, ప్రజా ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సాగునీరు అందించే విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తూ, కాలువ పనులకు సహకరిస్తున్న రైతులను అభినందించారు.ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ అమలును బిఎంఎస్ స్వాగతం




**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో భారతీయ మద్దూర్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ, భారత ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను బిఎంఎస్ స్వాగతిస్తుందని తెలిపారు. కార్మిక రంగానికి ఇది చారిత్రాత్మకమైన రోజు అని, భారతదేశంలో ఇంత పెద్ద కార్మిక సవరణ మునుపెన్నడూ జరగలేదని ఆయన పేర్కొన్నారు.వేతనాల కోడ్ 2019, సామాజిక భద్రత కోడ్ 2020, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని ప్రదేశాల్లో పరిస్థితుల కోడ్ 2020 విషయాల్లో బిఎంఎస్ జాతీయ నాయకత్వం సవరణలు కోరగా, కేంద్ర కార్మిక శాఖ మంత్రి సానుకూలంగా స్పందించి పార్లమెంటు సమావేశంలో తగు సవరణలు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు.ఈ కోడ్స్ అమలుతో దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి సామాజిక భద్రత, ప్రతి కార్మికుడికి నియామక పత్రాలు, కనీస వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. నిర్దిష్ట పనిగంటలు దాటితే ఓవర్‌టైమ్ వేతనం, 40 సంవత్సరాలు దాటిన కార్మికులకు వార్షిక ఆరోగ్య పరీక్షలు వంటి ప్రయోజనాలు అందుతాయని వివరించారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, నక్క అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో జాతీయ పార్మసీ వారోత్సవాలు



**తిమ్మాపూర్, నవంబం 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 64వ జాతీయ పార్మసీ వారోత్సవాల రెండవ రోజు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు ఫార్మాకో విజిలెన్స్ పై ప్రత్యేక వెబినరీ నిర్వహించారు.కోవన్స్ కంపెనీ అసోసియేట్ మెడికల్ సేఫ్టీ డైరెక్టర్ ఎస్. ప్రియాంక ముఖ్య అతిథిగా పాల్గొని, ఫార్మాకో విజిలెన్స్ అవసరాన్ని వివరించారు. ఔషధ ప్రతికూల చర్యలను గుర్తించడం ద్వారా రోగి భద్రతను కాపాడటం, ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. వివిధ దేశాల్లో ఔషధ ప్రతికూల చర్యలను గుర్తించే ప్రమాణాలు, వాటిని నియంత్రణ సంస్థలకు అందజేసే విధానాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు.తదనంతరం తిమ్మాపూర్ మోడల్ స్కూల్లో విద్యార్థులకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ బ్రాంచ్ సౌజన్యంతో, డాక్టర్ పుల్లారావు పర్యవేక్షణలో వాగేశ్వరి పార్మసీ కళాశాల విద్యార్థులు ఈ పరీక్షలు చేపట్టి, రక్తహీనతకు కారణాలు, దాన్ని అధిగమించడానికి తగిన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వాగేశ్వరి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు వి. వినోద్, సిహెచ్. ప్రకాశ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ఆర్. రామకృష్ణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 4 లేబర్ కోడ్స్ రద్దుకై జూలై 9 దేశవ్యాప్త సమ్మెకు పిలుపు



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లాలోని రైస్ మిల్లులలో సమ్మెకు సంబంధించి సిఐటియు జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి, యూనియన్ నాయకులు గట్టు సతీష్, చల్ల లక్ష్మణ్ కలిసి జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన్పల్లి నర్సింగరావుకు సమ్మె నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్‌ను అమలు చేసిందని, ఇవి కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసలుగా మార్చే ప్రయత్నమని తీవ్రంగా విమర్శించారు. 2019లో వేతనాల కోడ్‌ను, 2020లో పారిశ్రామిక వివాదాలు, సామాజిక భద్రత, విధి నిర్వహణలో భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్లను ఏకపక్షంగా ఆమోదించిందని తెలిపారు. కరోనా కల్లోల సమయంలో ప్రజలు తల్లడిల్లుతుండగా ఈ నిర్ణయాలు తీసుకోవడం కార్మిక వ్యతిరేక చర్య అని అన్నారు. 1991 నుండి సరళీకృత విధానాలను ప్రతిఘటించేందుకు దేశవ్యాప్తంగా కార్మిక వర్గం 22 సార్వత్రిక సమ్మెలతో సహా అనేక ఉద్యమాలు చేసినట్లు గుర్తుచేశారు. ట్రేడ్ యూనియన్స్ చట్టం-1926, ఇండస్ట్రియల్ ఎంప్లాయ్మెంట్ చట్టం-1946, పారిశ్రామిక వివాదాల చట్టం-1947లను రద్దు చేసి కొత్త పారిశ్రామిక సంబంధాల కోడ్‌ను రూపొందించడం ద్వారా పర్మినెంట్ ఉద్యోగాల వ్యవస్థకు ముప్పు తెచ్చిందని పేర్కొన్నారు. వేతనాల చెల్లింపు చట్టం, కనీస వేతనాల చట్టం, బోనస్ చెల్లింపు చట్టం, సమాన వేతన చట్టాలను రద్దు చేసి వేతనాల కోడ్-2019ను అమలు చేయడం కార్మికుల హక్కులను దెబ్బతీస్తుందని ఆయన అన్నారు. నవంబర్ 21న ఇచ్చిన నోటిఫికేషన్‌తో 29 కార్మిక చట్టాలు రద్దు అవుతాయని, దీనిపై సంఘటిత, అసంఘటిత కార్మికులు ఐక్యంగా పోరాడి జూలై 9న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు యు. శ్రీనివాస్, సి. హెచ్. కుమార్, సి. హెచ్. శ్రీనివాస్, రాజమౌళి, పరశురాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అతివలు అన్నిరంగాల్లో ముందుండాలి

## ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి



**మానకొండూర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానకొండూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీతో కలిసి ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి స్వయం సహాయక సంఘాలను బలపరుస్తోందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన అన్నారు. పట్టణాల్లో దినసరి కూలీలు, షాపుల్లో పనిచేసే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం నెలకు 1500 రూపాయల వరకు ఆదా అవుతుందని వివరించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శిస్తూ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరిట పేదలను మోసం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని అన్నారు. ప్రతిపక్షాలు ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేకపోయిన బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే, కాంగ్రెస్ పాలన ప్రజలకు మేలు చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ప్రతిపక్షాల మాటలకు మోసపోకుండా, అన్ని విధాలుగా మంచి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉప ముఖ్యకార్యనిర్వహణాధికారి టి. పవన్ కుమార్, మండల అభివృద్ధి అధికారి వరలక్ష్మి, తహసీల్దార్ విజయ్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, సాయిరి దేవయ్య, బోళ్ల మురళీధర్, మ్యాడ తిరుపతిరెడ్డి, వాల అంజుత్ రావు, నాగిశెట్టి రాజయ్య, కనుకం కుమార్, బాకారపు రమేశ్, చలిగంటి ఓదెలు, సహదేవ్, గొల్లెన కొమురయ్య, బి. శ్రీధర్, శ్రీకాంత్, మడుపు ప్రేమ్ కుమార్, కోంద్ర సురేష్, ఇర్ఫాన్, శ్యాంకుమార్, కవిత, దూలం దేవేంద్ర, తమిశెట్టి రాజేశ్, బుర్ర చంద్రాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు




**మంచాల, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంచాల మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో జన సందేశ్ ఫౌండేషన్ అధినేత గోగిరెడ్డి లచ్చిరెడ్డి, డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి చికిత్స చేసి, అందులో 10 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. గోగిరెడ్డి లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కంటి శుక్లాలతో బాధపడుతున్న వారి కోసం మండల కేంద్రాల్లో నెలకు ఒకటి లేదా రెండు సార్లు క్యాంపులు నిర్వహిస్తామని, ప్రతి నెలలో 10 మందికి ఐ హాస్పిటల్‌లో ఆపరేషన్లు చేయించే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఇప్పటివరకు అనేక మందికి సాధూరం హాస్పిటల్‌లో ఆపరేషన్లు జరిపినట్లు డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింజమూరు వెంకటరెడ్డి, గ్రామ ప్రముఖులు మార మౌని శ్రీశైలం యాదవ్, వేదిరె జగదీశ్వర్ రెడ్డి, నా రెడ్డి నరసింహారెడ్డి, అని రెడ్డి వెంకట్ రెడ్డి, గడ్డం రాజేందర్ రెడ్డి, మల్లగా శ్రీశైలం, ఓరుగంటి పూర్ణచందర్, జక్కా శేఖర్, పాండాల జంగయ్య గౌడ్, ఓరుగంటి వెంకటేష్ గౌడ్, శివరాళ్ల పాండు, జక్కా హరీష్, టెక్నీషియన్ శివుజీ, క్యాంప్ ఆర్గనైజర్ అశ్వల బాల్ రాజ్, పసుల కృష్ణ, మొగిలి మహేష్, కడారి లింగ మహేష్, గౌర శేఖర్, రావుల శ్రీకాంత్, ప్రసాద్ రావు, మల్లయ్య, మల్లారెడ్డి, దర్శన్ రెడ్డి, లక్ష్మమ్మ, పోచమ్మ, బావమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జానపద కళాకారుల ఐక్యతే

## తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి బలం - మంత్రి పొన్నం



**హుస్నాబాద్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్‌లో ఈనెల 28న జరగబోయే తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం ఆవిర్భావ రాష్ట్ర సదస్సుకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి సిల్వర్ గోల్డ్ అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్, సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్లపల్లి సంధ్య పాల్గొన్నారు. కరీంనగర్ కళాభారతిలో జరగబోయే ఈ సదస్సుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు తెలంగాణ సాంస్కృత సారధి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ రాష్ట్ర సంచాలకులు నరసింహా రెడ్డి హాజరుకావాలని ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్లపల్లి సంధ్య మాట్లాడుతూ, జానపద సకల వృత్తి కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, వృద్ధ కళాకారులకు పెన్షన్లు అందించాలని విజ్ఞప్తి చేశారు. బోనాల పండుగ, బతుకమ్మ వేడుకలలో కళాకారులకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా అవకాశాలు కల్పించాలని కోరారు. కరీంనగర్‌లో జరగబోయే రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో కళాకారులు హాజరై విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఎద్దు మమత, కేశ బోయిన రమ, ఈర్ల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల పెంపకం దారులకు వెన్నుదన్నుగా వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం జిల్లా యూనియన్ నూతన కమిటీ చైర్మన్ భాష వేణి మల్లేష్ యాదవ్, సభ్యులు హైదరాబాదులో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు నూతనంగా ఎన్నికైన చైర్మన్, సభ్యులకు అభినందనలు తెలిపారు. గొర్రెల పెంపకం దారుల సమస్యల పరిష్కారానికి సహకార సంఘం వెన్నుదన్నుగా నిలవాలని, తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శ సంఘంగా కరీంనగర్ యూనియన్ నిలవాలని ఆయన ఆకాంక్షించారు. సంఘానికి ప్రభుత్వం నుంచి పథకాలు, నిధులు పెద్ద మొత్తంలో మంజూరు అయ్యేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గొర్రెల పెంపకం దారుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు కరీంనగర్ జిల్లాకు పెద్ద సంఖ్యలో అందేలా సంబంధిత మంత్రి వాకటి శ్రీహరితో ప్రత్యేకంగా చర్చిస్తానని తెలిపారు. పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంఘం నిబంధనలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేస్తూ, తెలంగాణ రాష్ట్రంలోనే అత్యుత్తమ సంఘంగా మంచి పేరు తీసుకురావాలని రాజేందర్ రావు సూచించారు.

# ఆరోగ్యవంతమైన సమాజం కోసం

## - మాస్టర్స్ అథ్లెటిక్స్ విజయవంతం చేయాలి.




**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 13, 14 తేదీల్లో అంబేద్కర్ స్టేడియంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా నగరంలోని ఐఎంఏ హాల్లో అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమై వివరాలు వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ చాట్ల, సెక్రటరీ నీలం లక్ష్మణ్ మాట్లాడుతూ, కరోనా అనంతరం ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం పెంచుకున్నారని, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 2014లో ఇలాంటి పోటీలు విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేస్తూ, ఈసారి కూడా స్టేట్ మీట్ విజయవంతం కావడానికి కరీంనగర్ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ చాట్ల, జనరల్ సెక్రటరీ నీలం లక్ష్మణ్, ట్రెజరర్ కుడాల శిరీష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పెంచాల కిషన్ రావు, రాజిరెడ్డి, వెంకటేష్, మహేందర్, మన్సూర్, ప్రభాకర్, పద్మ, రాధ, అమర్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితిలో 26వ సారి రక్తదానం



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ జిల్లాలోని ఫ్లోరెడ్స్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 10 రోజుల చిన్నారికి అత్యవసర పరిస్థితిలో బి ప్లస్ గ్రూప్ రక్తం అవసరమైంది. ఈ సమాచారం గాలిపెల్లి కుమార్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయగానే, తహేర్ కొండాపూర్ వాసి ఆకుల గిరి అయ్యప్ప స్వామి వెంటనే స్పందించి 26వ సారి రక్తదానం చేసి చిన్నారి ప్రాణాలకు అండగా నిలిచారు. భక్తి అంటే దేవుణ్ణి పూజించడంలోనే కాదు, అపదలో ఉన్నవారికి సహాయం చేయడంలోనూ ఉందని ఆయన నిరూపించారు. అయ్యప్ప భక్తుడిగా ఆభాగ్యుల కన్నీళ్లు తుడుస్తూ, నిజమైన భక్తి సేవలో నిలిచారు. ఈ రక్తదాన కార్యక్రమంలో సోషల్ ఆక్తివేటిస్, ప్రముఖ రక్తదాత గాలిపెల్లి కుమార్ కూడా పాల్గొన్నారు.

# మహాత్మా నగర్‌లో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం

**తిమ్మాపూర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ (ఎల్ ఎం డి) గ్రామంలో ఆదివారం శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. దేవాలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించబడింది. ఉదయం 10 గంటల 26 నిమిషాలకు శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి, గణపతి, సుబ్రహ్మణ్య, నాగేంద్ర, పార్వతీదేవి, నవగ్రహ, శిఖరధ్వజ యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో జరగనున్నాయి. ప్రతిష్ఠా



మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వస్తివాచనం, స్థాపిత దేవతా పూజలు, నవగ్రహ, మాతృక, యోగిని, వాస్తు, క్షేత్రపాలక, బ్రహ్మాది మండల దేవతా హవనాలు నిర్వహించారు. సాయంత్రం పంచసూక్త హవనాలు, రుద్రహవనాలు, ప్రధాన దేవతా మంత్రహవనాలు, మహాస్నపనం, ధ్యానాది వాస, పుష్పాదివాస, ఫలాదివాస, షోడశ కళ్యాణ్యాసాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదం వితరణ ఏర్పాటు చేశారు. వేదమూర్తి బ్రహ్మశ్రీ జక్కి కృష్ణావధాని, గురు స్వామి కావేటి పరమేశ్వర స్వామి మార్గనిర్దేశంలో, పర్యవేక్షణలో ఈ మహోత్సవం జరుగుతోంది. దేవాలయ కమిటీ నిర్వాహకులు సమస్త హిందూ బంధువులు, అయ్యప్ప భక్తులు సకుటుంబ సమేతంగా హాజరై శ్రీ అయ్యప్ప స్వామివారి దివ్యకృప, ఆశీస్సులు పొంది ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# చేగుంట -వడియారం రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి





**మెదక్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రైల్వే, ఫారెస్ట్, ఆర్ &బీ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ, చేగుంట-వడియారం రైల్వే గేటు వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైల్వే గేటు మూసివేయబడిన ప్రతిసారి వందలాది వాహనాలు నిలిచిపోవడం వల్ల అంబులెన్స్‌లు, అత్యవసర సేవల వాహనాలు తీవ్ర అంతరాయానికి గురవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రద్దీ సమయాల్లో పాదచారులు రైల్వే ట్రెక్కులను దాటే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడి, పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. రోడ్లు - రైలు సంగమ ప్రాంతాల్లో జరిగే ప్రమాదాలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ఎంపీ గుర్తుచేశారు. సంబంధిత శాఖల ఇంజనీర్లు, కాంట్రాక్టర్ సమన్వయంతో ఆర్వోబీ పనులను వేగవంతం చేసి తక్షణం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే సర్వీస్ రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్, సిగ్నలింగ్ వంటి అనుబంధ సదుపాయాలను సమగ్రంగా ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షితమైన రవాణా వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. రాబోయే రోజుల్లో చేగుంట -వడియారం రైల్వే మార్గాన్ని "జీరో యాక్సిడెంట్ జోన్"గా తీర్చిదిద్దే లక్ష్యంతో చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమన్వయ సమావేశంలో రైల్వే, ఆర్& బీ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 150 ఏళ్ల మహోన్నత చరిత్ర..

**యాచారం, నవంబర్ 22 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: జాతీయ గీతం 'వందేమాతరానికి' 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యాచారం మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో జడ్.పి.హెచ్.ఎస్ మరియు ప్రాథమిక పాఠశాల లో వందేమాతరం గీతం రాసి నూట యాభై సంవత్సరాలు అయినా సందర్భంగా స్కూల్ విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతం ఆలపించి దాని ప్రత్యేకతను వివరించడం గురించి ఏర్పాటు చేసిన, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... 1875 శ్రీ బంకిం చంద్ర చటర్జీ రాసిన తరువాత 1896 లో మొట్ట మొదటి సారిగ రవీంద్రనాథ్ ఠాగూర్ పాడటం జరిగింది. ఇట్టి సందర్భంగా నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి మండలి సమావేశమై వందేమాతరం రాసి 150 సంవత్సరాలు అయినా సందర్భంగా వేడుకలు చేసుకోవాలని చెప్పడం తో ఈరోజు ఇక్కడికి



వచ్చామని చెప్పారు వందేమాతరం గీతం లో అఖండ భారతదేశం లో ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు ఆచార వ్యవరాలను స్పృశిస్తూ దేశ ప్రజలు సమైక్యతతో సంఘటితంగా ఉండాలని దింట్లో పొందుపరిచారాని 1905 లో జరిగిన బెంగాల్ విభజన లో స్వదేశీ ఉద్యమం లో ఎక్కువగా



ప్రజలు ఆకర్శితులై ఉత్తేజంగా స్వాతంత్ర ఉద్యమం లో పాల్గొన్నారని విద్యార్థులకు వివరించారు, ఇట్టి కార్యక్రమం లో కుమ్మరి గూడెం పురుషోత్తం, ఆంబోజి జగదీశ్ యాదవ్, రాయకంటి విజయ్ కుమార్, దేవరకొండ ఈశ్వర్, నాయిని పాండు రెడ్డి,తాండ్ర రవీందర్, పగడాల శ్రీశైలం, పల్లపు నరేష్, మాధం జంగయ్య, నడుకుడి కృష్ణ, పత్తి రాజు,అండెకర్ సురేష్,బూత రాజు నాగరాజు,కొండాపురం నాగరాజు, సంగేమ్ శ్రీనాథ్,కుంచారం సందీప్ రెడ్డి, కర్నాటి రాజు తో పాటు జడ్పీహెచ్ఏ యాచారం ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# చిల్వకోడూరులో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమం

**ధర్మపురి, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: ధర్మపురి నియోజకవర్గంలోని చిల్వకోడూరు గ్రామంలో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంచ్‌ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవసరమైన వసతులను అందించే దిశగా ట్రస్ట్ చేస్తున్న కృషిని అభినందించారు. పాఠశాలల్లో విద్యా సదుపాయాలను మెరుగుపర్చేందుకు లక్ష్యంగా ట్రస్ట్ తరఫున బెంచ్‌లు పంపిణీ చేయగా, స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీ వంశీ కృష్ణ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి విశాఖ చారిటబుల్ ట్రస్ట్ కీలక పాత్ర పోషిస్తోందని,




విద్యార్థులకు మెరుగైన వసతులు అందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు అత్యంత అవసరమని అన్నారు. ఆయన పేర్కొంటూ, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఇప్పటి వరకు దాదాపు 50,000 బెంచులు అందజేయడం తమ కుటుంబానికి గర్వకారణమని, భవిష్యత్తులో మరింత సేవలను విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. అదేవిధంగా ఆయన, ప్రజల అవసరాల కోసం దాదాపు 2,000 బోర్‌వెల్లు ఏర్పాటు చేసినట్లు గుర్తుచేసి, కొన్ని పాఠశాలలు అత్యవసరంగా కోరిన బాత్రూం సదుపాయాల కోసం వెంటనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలకు సంబంధించిన ఇతర అవసరాలపై కూడా తక్షణ చర్యలు తీసుకుంటామని, ఎంపీ లాడ్స్ నిధులు లేదా విశాఖ సహాయంతో త్వరగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

# కరీంనగర్‌లో నిరాశ్రయుల సర్వే

### పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ చర్యలు



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో చలికాలం నేపథ్యంలో రోడ్లపై నివసిస్తున్న ఆశ్రయం లేని వ్యక్తులను గుర్తించేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సర్వే నిర్వహించారు. బస్ స్టాండ్, 1-టౌన్ పోలీస్ స్టేషన్ పరిసరాలు మరియు ఇతర ముఖ్య కూడళ్లలో జరిగిన ఈ సర్వేలో మొత్తం 15 మంది నిరాశ్రయులు గుర్తించబడి, వారిని కట్టరాంపూర్‌లోని నగరపాలక సంస్థ నిరాశ్రయుల కేంద్రానికి తరలించారు. నిరాశ్రయుల సంక్షేమం కోసం ఈ సర్వేను నిరంతరంగా కొనసాగిస్తామని, నవంబర్ 22న కూడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వేలో మెప్మా, మునిసిపల్, హెల్త్, సఖీ మరియు పోలీస్ సిబ్బంది సమన్వయంతో పాల్గొన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కరీంనగర్ పథక సంచాలకులు జి. స్వరూప రాణి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# వెంకట్ ఫౌండేషన్ బాలగోకులం సందర్శించిన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్‌లో నిర్వహించబడుతున్న వెంకట్ ఫౌండేషన్ బాలగోకులాన్ని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఇన్చార్జి రామ్మోహన్ మాట్లాడుతూ, నిరాశ్రయులైన పేద పిల్లలకు ఆరవ తరగతి నుండి ఇంజనీరింగ్ వరకు చదువుతున్న దాదాపు 30 మందికి పైగా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, భోజనం, వైద్యం, స్టేషనరీ, దుస్తులు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ గంప వెంకట్, సభ్యులు మల్యాల ప్రభాకర్, గంప జగన్, గౌరిశెట్టి సురేందర్, మల్యాల అంజయ్యతో కలిసి ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను ఆహ్వానించారు. ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన ఎంతగానో అభినందించారు.

# మృతి చెందిన నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అంద జేసిన ఉప్పల



**కల్వకుర్తి, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి మండల పరిధిలోని పంజుగుల గ్రామం లో నిరుపేద వైశ్య కుటుంబానికి చెందిన పోల శ్రీనివాసులు అకాల మరణం గ్రామంలో విషాదాన్ని నింపింది. శ్రీను ఆకస్మిక మృతి చెందడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇక్కట్లలో పడింది. ఈ విషయం గ్రామ బి.ఆర్.ఎస్. పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బి.ఆర్.ఎస్. రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తక్షణమే స్పందించారు. మృతుడి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం తెలియజేసి అంతిమక్రియల నిర్వహణకు వెంటనే పదకొండు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ మానవతా స్పర్శకు కృతజ్ఞతలు తెలిపిన మృతుడి కుటుంబ సభ్యులు ఇటువంటి క్లిష్ట సమయంలో అండగా నిలిచిన ఉప్పల వెంకటేష్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్. నాయకులు దారమోని గణేష్ , మాజీ వార్డు సభ్యులు ఖాజా, మాజీ కో-ఆప్షన్ సభ్యులు యెలిసా, కొండల్ రెడ్డి, పోల మల్లేశ్వర్, కృష్ణమాచారి, సలీం తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలుగా ఆంక్ష రెడ్డి

**సిద్ధిపేట, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీకి కొత్త అధ్యక్షురాలిగా తుంకుంటా ఆంక్ష రెడ్డి నియమితులయ్యారు. శనివారం ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేస్తూ తెలంగాణలోని అన్ని జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను ప్రకటించింది. జిల్లా యువతకు ప్రాధాన్యత కల్పిస్తూ ఆంక్ష రెడ్డి బాధ్యతలు అప్పగించడం పట్ల స్థానిక నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. యువతను ముందుకు తీసుకెళ్లే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ నిర్ణయం జిల్లాలో చైతన్యాన్ని రేకెత్తించింది.



# రాష్ట్ర డిజిపిని కలిసిన మాల మహానాడు జేఏసీ నాయకులు



**హైదరాబాద్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్‌లో శనివారం తెలంగాణ మాల మహానాడు జేఏసీ నాయకులు రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) నోటిఫికేషన్‌లో మాల 25 కులాలకు అన్యాయం జరిగిందని వారు డిజిపి దృష్టికి తీసుకువెళ్లారు.జేఏసీ ఛైర్మన్ మాందాల భాస్కర్ ఆధ్వర్యంలో, గౌరవ ఛైర్మన్ చెరుకు రామచందర్, గ్రేట్ హైదరాబాద్ ఛైర్మన్ బేరా బాలకిషన్, మాల స్టూడెంట్ జేఏసీ ఛైర్మన్ మాదాసు రాహుల్ రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టిన ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయంగా జరగకపోవడం, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించకపోవడం వలన మాల సామాజిక వర్గం రిజర్వేషన్లు కోల్పోతున్నాయని వివరించారు.జేఏసీ నాయకులు తమ ప్రధాన డిమాండ్లను డిజిపికి తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించాలని, 20 లోపు రెండు రోస్టర్ పాయింట్లు కేటాయించాలని, రెండు శాతం రిజర్వేషన్ పెంచిన తర్వాతనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, అంతవరకు పోలీస్ శాఖ నోటిఫికేషన్లను నిలిపివేయాలని వారు కోరారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా మాలలకు జరుగుతున్న నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయడమే తమ ఉద్దేశమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.డిజిపి శివధర్ రెడ్డి మాల సంఘాల జేఏసీ నాయకుల వినతిపై సానుకూలంగా స్పందిస్తూ, ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## ఇందిరా మహిళా శక్తి చీరల పథకం ప్రారంభించిన మంత్రి: కోమటిరెడ్డి వెంకటరెడ్డి




**నల్లగొండ,నవంబర్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండ జిల్లా కలెక్టరేట్ లోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పథకం పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మహిళామణులకు చీరలను అందజేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 1 కోటి 15 లక్షల కుటుంబాలు ఉన్నాయి. అందులో కోటి మంది మహిళలకు ఆత్మగౌరవంతో ఉండేలా నాణ్యమైన చీరలను అందించేందుకు ఈ శనివారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం భారీగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి చీరలను పంపిణీ చేస్తామని వెల్లడించారు.మహిళల గౌరవం, శక్తివంతమైన, వారి సామాజిక స్థాయిని పెంచే దిశగా ఈ కార్యక్రమం కీలక అడుగుగా నిలుస్తుంది అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లేబర్ కోడ్లకు కు వ్యతిరేకంగా నరసన



**ఎలిగేడు, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మండల కేంద్రం లోని అంబేద్కర్ చౌక్ లో శనివారం పారిశుధ్య కార్మికుల కు వ్యతిరేకం కేంద్ర ప్రభుత్వం తిసుకొచ్చిన నాలుగు లేబర్ కొడ్లకు వ్యతిరేకం గా గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు నల్ల బ్యాడ్జి లు ధరించి నిరసన తెలిపారు.బేషరత్తు గా ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. సి ఐ టి యు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. పారిశుధ్య కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, సమన్వయ కమిటీ అధ్యక్షుడు కవ్వం పల్లి దేవేందర్,జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య,కాయదర్శి సరిన్, నర్సయ్య,లక్ష్మన్, నేరేడుకొమ్మ సత్య నారాయణ,పంగ భాస్కర్,రమేష్, మల్లేశం, రమేష్,లక్ష్మి,మల్లయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# 29,30వ తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి:సిఐటియు



**నల్లగొండ,నవంబర్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కార్మికుల ఉద్యోగాల పోరాటాల సారథి సీఐటీయూ నల్గొండ జిల్లా 13వ మహాసభలు పోరాటాల పురిటిగడ్డ నల్లగొండ పట్టణంలో ఈనెల 29,30వ తేదిలలో జరుగుతున్న సందర్భంగా 29న కార్మిక ప్రదర్శన జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పోలే సత్యనారాయణ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భీమగాని గణేష్ పిలుపునిచ్చారు శనివారం తిప్పర్తి మండల కేంద్రంలో సిఐటియు జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యత పోరాటం నినాదంతో 1970లో సీఐటీయూ ఏర్పడినప్పటి నుండి దేశంలో కార్మిక వర్గ హక్కుల కోసం అనేక పోరాటాలు చేసింది సీఐటీయూ మాత్రమేనన్నారు. కార్మికుల హక్కులే కాకుండా రైతాంగం వ్యవసాయ కార్మికులు సామాజిక సంఘాల పోరాటాలకు సీఐటీయూ అండగా నిలుస్తుందని తెలిపారు ఈనెల 29 న నల్గొండ పట్టణ కేంద్రంలో కార్మిక ప్రదర్శన జరుగుతుందని ఈ ప్రదర్శనకు కార్మికులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ల లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26000 నిర్ణయించాలని, ఆశ అంగన్వాడీ, మధ్యాహ్నం భోజన కార్మికుల, ఐకెపి విఓఏ, భవన నిర్మాణం, హమాలి, గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యల పరిష్కరించాలని, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేష్ డివైఎఫ్ఐ తిప్పర్తి మండల కార్యదర్శి పోకల శశిధర్ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పోలవరం కిన్నెర సైదమ్మ రూతమ్మ సత్తమ్మ ఇందిరమ్మ రేణుక వెంకటమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో అభయ యాప్ ప్రారంభం




**మహబూబాబాద్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అభయ యాప్ మై ఆటో టాక్సి సేఫ్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 600 ఆటోలకు క్యూఆర్ కోడ్ అనుసంధానం చేసి ప్రయాణికుల భద్రత కోసం కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.ఎస్పీ మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు రహదారి నియమాలను పాటిస్తూ పరిమితిని మించకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ప్రయాణికులు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఏదైనా సంఘటన ఎదురైనప్పుడు ఆటోపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరని, వెంటనే డ్రైవర్ ఫోటో, వాహన వివరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సమీపంలోని పోలీసులు తక్షణమే అక్కడికి చేరుకొని రక్షణ చర్యలు చేపడతారని ఆయన భరోసా ఇచ్చారు.అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే ఆటో డ్రైవర్లను సీసీ కెమెరాలు, క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ తిరుపతి రావు, సీఐలు మహేందర్ రెడ్డి, రవి కుమార్‌తో పాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు ప్రత్యేక గుర్తింపు

వృద్ధాశ్రమ నిర్వాహకుడు
వెంకటయ్యను సత్కరించిన అడిషనల్ కలెక్టర్



**కల్వకుర్తి, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి పట్టణంలోని ప్రజల భాగస్వామ్య సంస్థ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉత్తమ సేవలందిస్తున్న వృద్ధాశ్రమ నిర్వాహకుడు పెరుమళ్ళ వెంకటయ్యను జిల్లా అడిషనల్ కలెక్టర్ అమరేందర్,డిడబ్ల్యూఓ రాజేశ్వరిలు సత్కరించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో శనివారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డీడబ్ల్యుఓ రాజేశ్వరి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ అమరేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కల్వకుర్తి పట్టణంలో గత 16 ఏండ్లుగా వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ వృద్ధులకు అన్ని విధాలుగా తోడుగా ఉంటూ సేవలందిస్తున్న నిర్వాహకుడు పెరుమళ్ళ వెంకటయ్యను అడిషనల్ కలెక్టర్ అమరేందర్, బిడబ్ల్యూఓ రాజేశ్వరిలు అభినందిస్తూ శాలువా, మెమొంటోతో సత్కరించారు. వృద్ధులకు సేవ చేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు సీనియర్ సిటిజన్స్ నాయకులు,అధికారులు, బిజినపల్లి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు రాణి కుమారి,పలువురు వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధి కోసం నాణ్యమైన చేప పిల్లల పంపిణీ



**మహబూబాబాద్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంబాల చెరువులో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ మాట్లాడుతూ, మత్స్యకారుల కుటుంబాలకు చేపల పెంపకం ద్వారా ఉపాధి కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన 1 లక్ష 26 వేల చేప పిల్లలను చెరువులో వదిలిపెట్టిన ఎమ్మెల్యే, నియోజకవర్గంలోని 305 చెరువులలో కోటి 73 లక్షల 45 వేల రూపాయల విలువగల చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. చెరువులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మత్స్యకారులపై ఉందని ఆయన సూచించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 50 శాతం మాత్రమే చిన్న చేప పిల్లలను పంపిణీ చేసినప్పటికీ, కాంగ్రెస్ పాలనలో 100 శాతం నాణ్యమైన చేప పిల్లలను అందిస్తున్నామని ఎమ్మెల్యే మురళీ నాయక్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శివ ప్రసాద్, మత్స్యకారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# సర్దార్ పటేల్ స్ఫూర్తితో మహబూబాబాద్‌లో ఐక్యత పాదయాత్ర.




**మహబూబాబాద్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఐక్యత పాదయాత్ర ఘనంగా నిర్వహించబడింది. ప్రజల్లో జాతీయ సమైక్యత, ఐక్యత, దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్‌లతో కలిసి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ అనిల్ సుఖ్ దేవ్ రావు భోండే జెండా ఊపి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీ ఒగ్గు కళాకారుల విన్యాసాలు, విద్యార్థుల సాంప్రదాయ నృత్యాలతో మరింత ఆకర్షణీయంగా మారింది.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ అనిల్ సుఖ్ దేవ్ రావు భోండే మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి వల్లే దేశం నేటికీ ఐక్యతతో ఉందని, ఆయన వందల సంస్థానాలను విలీనం చేసి దేశభక్తి, ఐక్యతను పెంపొందించిన మహనీయుడని కొనియాడారు. ఎన్ని భాషలు మాట్లాడినా, ఎన్ని ప్రాంతాలు ఉన్నా మనమందరం ఒకటేనని ఆయన స్పష్టం చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లాల మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ మాట్లాడుతూ, ప్రజల్లో ఐక్యత భావం, దేశభక్తి పెంపొందించేందుకే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

# అవార్డు గ్రహీత భజరంగ్ ను సన్మానించిన బీసీ సంఘం నాయకులు



**నల్లగొండ, నవంబర్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్ కు ఎంపికైన సాక్షి సీనియర్ స్టాఫ్ ఫోటోగ్రాఫర్ కంది భ జరంగ్ ప్రసాద్ ను లయన్స్ క్లబ్ లో జరిగిన బిసి సంఘం సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఇప్పటివరకు 80 అవార్డులు స్వీకరించడం అభినందనీయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్ మునస ప్రసన్న కుమార్, టౌన్ చేసి చైర్మన్ పుట్ట వెంకన్న, ఊరెళ్ళ విజయ్ కుమార్, గుండు వెంకటేశ్వర్లు, బకతట్ల వెంకన్న, తిరుపతయ్య, చిలక రాజు సతీష్ కుమార్, వడ్డబోయిన రామకృష్ణ ఇతరులు పాల్గొన్నారు

# ఘనంగా సత్య సాయిబాబా పల్లకి సేవ



**నల్లగొండ,నవంబర్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం బాబా పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. మేధా తాళాలతో భజనలు కీర్తనలు, కోలాట బృందంతో పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రసాదం పంపిణీ చేశారు. సత్య సాయి సేవ సమితి కన్వీనర్ పున్న విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా పురుష సేవాదళ్ సభ్యులు, బాలవికాస్ విద్యార్థులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం గీతానికి 150 ఏళ్ల వేడుకలు





**మహేశ్వరం, నవంబర్ 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా నియోజకవర్గంలో వందేమాతరం జాతీయ గీతం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ భారతీయ జనతా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మహేశ్వరం మండల అధ్యక్షుడు యాదీష్ ఆధ్వర్యంలో మన్నాన్‌పల్లి చౌరస్తాలో వివిధ పాఠశాలల విద్యార్థులు సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, “వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణనిచ్చిన మహోగ్ర గీతం. 150 ఏళ్ల తర్వాత కూడా అదే స్ఫూర్తిని నేటి యువతలో నింపే శక్తి దీనిలో ఉంది,” అని కొనియాడారు. జాతీయత, దేశభక్తి భావాలను బలోపేతం చేయడానికి బీజేపీ ప్రతిస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు, పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ వేడుకలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కుండే వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్, ఉపేందర్, మునావత్ దేవేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్లేష్ యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో పేదల కలల సాకారం

- ఎమ్మెల్యే విజయరమణ



**పెద్దపల్లి, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)** పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రూ.45 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించి, ఎంపికైన ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసి నిర్మాణ పనుల కోసం స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేసిన పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ. విజయరమణ మాట్లాడుతూ, కొత్తపల్లి గ్రామంలో ఇప్పటి వరకు రూ.67 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని, దశలవారీగా గ్రామాన్ని ప్రగతిపథంలోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతుందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా కూడా అమలు చేస్తోందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుండి 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, సన్న బియ్యం పంపిణీ, గ్యాస్ సబ్సిడీ వంటి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా కొత్తకోటలో భారీ పాదయాత్ర



**వనపర్తి,నవంబర్ 22( నీలగిరి ఎక్స్ ప్రెస్):** కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల శాఖ, మేరా యువ భారత్ (మై భారత్) ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకుని చేపట్టిన పాదయాత్రకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రారంభ ఏర్పాట్లు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ కోట నాయక్ మాట్లాడారు. కొత్తకోట టౌన్‌లో 25వ తేదీన జరగనున్న ఈ భారీ పాదయాత్రలో విద్యార్థులు, విద్యార్థినీలు, యువజన సంఘాలు, జాతీయవాద పౌరులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ రాజేందర్ గౌడ్, కో–కన్వీనర్ బచ్చు రాములు, భూపతి గౌడ్, గజరాజుల తిరుమలేష్, రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డిహెచ్‌ఎంఓ, డిఐఓ తదితర అధికారులు పాల్గొన్నారు. పాదయాత్ర విజయవంతం కావాలనే లక్ష్యంతో పోస్టర్‌ను సమావేశంలో విడుదల చేశారు. సర్దార్ పటేల్ సిద్ధాంతాలను యువతలో వ్యాప్తి చేయడానికి అందరూ చురుకుగా పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# అమీర్‌పేట్ గ్రామానికి 10 లక్షల రూపాయల నిధులు



**మహేశ్వరం, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని అమీర్‌పేట్ గ్రామంలో నూతన డ్రైనేజీ నిర్మాణానికి డీమఫ్ట్ ఫండ్ ద్వారా పది లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ కృషి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సహకారం ఉందని గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో భూమి పూజ నిర్వహించగా, మహేశ్వరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల యాదయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో అమీర్‌పేట్ గ్రామ శాఖ అధ్యక్షులు హైతాబాద్ రాజేందర్, మాజీ వార్డ్ మెంబర్ సభ్యులు, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు కడల భాస్కర్, సాంబ మల్లేష్, శ్రీ వెంకటేశ్వర దేవాలయ కమిటీ అధ్యక్షులు కరన్ కోట్ మల్లికార్జున్, చాకలి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డప్పు నరసింహ, కెజె ప్రసాద్, బాలకృష్ణ, సోషల్ మీడియా ఎర్ర నవీన్ కుమార్, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 26 నఛలో మహబూబ్ నగర్

-గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్ష.



**దేవరకొండ నవంబర్ 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతావత్ బాబురామ్ నాయక్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు లక్పతి నాయక్ ఈనెల 26న మహబూబ్ నగర్‌లో గిరిజన విద్యార్థి సంఘం నిర్వహిస్తున్న చలో మహబూబ్ నగర్ నిరసన దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మరియు గిరిజన హక్కుల పరిరక్షణ, గిరిజన విద్యార్థుల విద్యా అవకాశాల విస్తరణ, మరియు విద్యా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ ఉద్యమం చారిత్రాత్మకం అని వారు పేర్కొన్నారు. గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిరసన దీక్షలో అందరూ భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మరియు వివిధ లంబాడి సంఘ నాయకులు నాయకులు మాట్లాడుతూ “గిరిజన విద్యార్థుల భవిష్యత్తు, విద్యా విధానం, మరియు రాజ్యాంగ హక్కుల కోసం జరుగుతున్న ఈ ఉద్యమం అత్యంత కీలకం. అందరూ ఒకే గొంతుతో ఐక్యంగా 26వ తేదీన మహబూబ్ నగర్‌కు వెళ్లి మద్దతు తెలపాలి,” అని కోరారు. అదేవిధంగా గిరిజన విద్యార్థి సంఘం చేపట్టిన ఈ ఉద్యమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, గిరిజన సంక్షేమ సంఘం తరపున పూర్తి మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో శ్రీను నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో మంత్రి వివేక్ వెంకటస్వామి సుడిగాలి పర్యటన



**సిద్దిపేట, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)** సిద్దిపేట జిల్లాలో మంత్రి వివేక్ వెంకటస్వామి పలు కార్యక్రమాల్లో పాల్గొని సుడిగాలి పర్యటన నిర్వహించారు. దుబ్బాక మండలంలోని చిట్టాపూర్ పెద్ద చెరువులో చేప పిల్లల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, మత్స్య అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని తెలిపారు. 100 శాతం రాయితీపై 2 లక్షల 20 వేల పలు రకాల చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. మల్లన్నసాగర్ వద్ద 53 ఎకరాల ఫిష్ పాండ్ ఏర్పాటు చేయడానికి మత్స్య శాఖ మంత్రితో మాట్లాడి తప్పకుండా సాంక్షన్ చేస్తానని హామీ ఇచ్చారు. అదే రోజు దుబ్బాక నియోజకవర్గ కేంద్రంలోని ఐడిఓసి లో మహిళా సంఘాలకు 43,800 ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. సిరిసిల్లలో ప్రత్యేకంగా మహిళల ఎంపిక చేసిన డిజైన్, కలర్లతో 800 రూపాయల విలువగల నాణ్యమైన చీరలను తయారు చేసి అందిస్తున్నామని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందజేస్తోందని, వాటిని ఉపయోగించి వ్యాపారం చేసి కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. రుణాలను సకాలంలో చెల్లించి మరింతగా వ్యాపారాన్ని విస్తరించుకోవాలని, అన్ని రంగాల్లో మహిళ శక్తి పెంపొందించడమే ప్రభుత్వ ఆకాంక్ష అని అన్నారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీ రుణాలను మంజూరు చేసినట్లు గుర్తుచేసి, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరింత చొరవ తీసుకొని వడ్డీ లేని రుణాలను అందిస్తున్నారని వివరించారు. దుబ్బాక మహిళా సంఘాలు ఇప్పటికే 6 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను పొందినట్లు తెలిపారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి సన్న బియ్యం ప్రోగ్రాంను అమలు చేస్తున్నామని, 1970లలో పేదల కోసం ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల స్ఫూర్తితోనే ఇప్పుడు 17 లక్షల ఇండ్లను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేస్తే ప్రతి నియోజకవర్గానికి అదనంగా మరో 3,500 ఇండ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలు ఐకెపి కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతులకు త్వరగా పేమెంట్ వచ్చేలా కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ మహిళలు ఇంటి బాధ్యతలతో పాటు బిజినెస్, ఉద్యోగం చేస్తూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో మరింత ఎత్తుకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో వందేమాతరం గీతాలాపన



**జగిత్యాల, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జగిత్యాల పట్టణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకొని సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ ఆధ్వర్యంలో స్థానిక ఓల్డ్ హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు, నాయకులు, ప్రజలు కలిసి వందేమాతరాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సుధారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలను కొనియాడుతూ ప్రతి విద్యార్థి గుండెల్లో దేశభక్తి నింపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, ప్రధాన కార్యదర్శులు ఆముదరాజు, సిరికొండ రాజన్నతో పాటు బీజేపీ జిల్లా, పట్టణ నాయకులు రాగిళ్ల సత్యనారాయణ, దశరథ రెడ్డి, పెద్ద గంగారం, ఇట్నేని రమేష్, కళావతి, ఇట్యాల రాము, గాదాసు రాజేందర్, కొప్పు భాస్కర్, జున్ను సంతోష్, పవన్ సింగ్, మేడిపల్లి పుష్ప రెడ్డి, కదర్ల లావణ్య, గుండేటి గోపి, పిండూరు భానుప్రియ, సోమలక్ష్మి, సింగం పద్మ, మేకల లక్ష్మి, మామిడాల కవిత, కాయతి శంకర్, రాపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ



**గొల్లపల్లి, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ అకస్మాత్తుగా సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న విధానం, రైతులకు అందిస్తున్న సేవలు, తేమ శాతం పరీక్షలు, తూకం మరియు మద్దతు ధర చెల్లింపులపై ఆయన నేరుగా పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన MSP (మద్దతు ధర) తప్పకుండా అందాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా, మార్కెట్ శాఖలు సమన్వయంతో పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులతో మాట్లాడిన ఎంపీ, కొనుగోలు కేంద్ర పరిస్థితులు, పంట రక్షణ, వ్యాపారుల ప్రవర్తన, తక్షణ చెల్లింపులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. గ్రామ రైతులు తమ సమస్యలను వివరించగా, అధికారులు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పంచ పరివర్తన్ తో సమాజంలో మార్పు



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల భాగంగా గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంసేవకులు పలు దేవాలయాల వద్ద పూజలు చేసి, గడప గడపకు వెళ్లి ప్రజలకు పంచ పరివర్తన్ అంశాలను వివరించారు. ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ బాధ్యులు సీఏ నిరంజనాచారి, పాక సత్యనారాయణ, డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ, పంచ పరివర్తన్ ద్వారా సమాజంలో మార్పు, చైతన్యం తీసుకురావడం సాధ్యమవుతుందని తెలిపారు. సామాజిక సమరసత, కుటుంబ ప్రబోధన్, పర్యావరణ పరిరక్షణ, సంస్కృతి సాంప్రదాయాలు, పౌర నియమాలు అనే ఐదు అంశాలను ఆచరిస్తే సమాజంలో పరివర్తన తప్పక వస్తుందని వారు పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లు పూర్తి చేసుకుని ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక సంస్థగా ఎదిగిందని, సంఘం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి సమాజంలో పెరుగుతోందని వారు అన్నారు. ప్రతి ఇంటికి చేరుకోవడమే గృహ సంపర్క్ అభియాన్ ఉద్దేశమని వివరించారు. గత 100 సంవత్సరాలుగా సమాజ పరివర్తన అనే మహా యజ్ఞాన్ని ఆర్ఎస్ఎస్ నిరంతరాయంగా కొనసాగిస్తోందని, సంపూర్ణ సమాజాన్ని సంఘటితం చేయడం కోసం అన్ని వర్గాలు తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు.

# యూనిటీ మార్చ్‌కి కరీంనగర్ నుంచి నరెడ్ల ప్రవీణ్ రెడ్డి ఎంపిక



**హుజురాబాద్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా భారత ప్రభుత్వం సంవత్సరం పాటు ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నవంబర్ 23 నుంచి 30 వరకు వారం రోజుల పాటు దేశం నలుమూలల నుండి ఎంపికైన యువ ప్రతినిధులతో యూనిటీ మార్చ్ పేరుతో పాదయాత్ర జరుగనుంది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం, చిన్నపాపయ్యపల్లె గ్రామానికి చెందిన యువ నాయకుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి ఎంపికయ్యాడు. విద్యార్థి నాయకునిగా విద్యార్థుల సమస్యలపై ఉద్యమించిన ఆయన ప్రస్తుతం యువమోర్చాలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.
ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, నవంబర్ 23న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర నాగపూర్, ఇండోర్ మీదుగా గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహం (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ) వద్ద ముగుస్తుందని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశాన్ని ఐక్యతతో నిలబెట్టిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో దేశమంతా ఒకటిగా ఉండాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. గుజరాత్‌లో జరిగే ముగింపు కార్యక్రమానికి ప్రధాన అతిథిగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరై దేశ ప్రజలకు ఐక్యతా సందేశం అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా నుంచి యూనిటీ మార్చ్‌కి ఎంపిక చేసినందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మరియు ఇతర పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

# 42% రిజర్వేషన్ల డిమాండ్‌తో పోరాటానికి ఆజాది ఫెడరేషన్ పిలుపు.



**హుజురాబాద్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుజురాబాద్‌లో బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సమయంలో బీసీల ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి రాష్ట్రాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే కుర్చీ ఖాళీ చేయాలని ఆయన స్పష్టం చేశారు. గతంలో 12 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని కదిలించిన సందర్భంలోనే కుల గణన చేపట్టారని, అయితే అది తప్పులతడకగా జరిగిందని ఆయన విమర్శించారు. ప్రత్యేక స్వయంప్రతిపత్తి గల సంస్థతో చేయాల్సిన కుల గణనను ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం, ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి తప్పు నివేదికలు రాయించడం ద్వారా బీసీలను మోసం చేశారని ఆరోపించారు. బీజేపీ కూడా బీసీలపై కక్షపూరిత వైఖరితోనే వ్యవహరిస్తోందని, పేరుకు మాత్రమే బీసీ ప్రధానిగా చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ బీసీలకు ఏ మాత్రం ఉపయోగపడలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలకు నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచి విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాలలో అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి సంపత్ ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఇపకాయల సాగర్, బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి బుర్ర కుమార్ గౌడ్, బీసీ సంఘ నాయకులు పెరుమాండ్ల సదానందం, నాగరాజు, రాజు, మహేందర్, జూపక శివమణి, కందుకూరి భాస్కర్, స్థానిక నాయకులు సొల్లు బాబు, తునికి సమ్మయ్య, నాయి బ్రాహ్మణ సంఘం నడిగొట్టి రమేష్, ముదిరాజు సంఘం నాయకులు ఆళ్ల కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తి, క్రమశిక్షణకు ప్రతీక 77వ ఎన్సిసి డే వేడుకలు.



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా జంగల్వాడిలోని పి ఎం సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 77వ ఎన్సిసి డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించగా, విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుక మరింత ఆకర్షణీయంగా మారింది.
కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, సుధారాణి, వసుంధర, ఎన్సిసి ఆఫీసర్ వీ రాజేష్ పాల్గొన్నారు. అతిథులు మాట్లాడుతూ, ఎన్సిసి శిక్షణ పొందిన విద్యార్థులు దేశభక్తితో పాటు క్రమశిక్షణను అలవాటు చేసుకుంటారని, మిగతా విద్యార్థుల కంటే భిన్నంగా నిలుస్తారని పేర్కొన్నారు. ఎన్సిసి శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమై, వారికి చక్కని అవకాశాలను కల్పిస్తుందని వివరించారు.

# రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్

**-జాతి సేవలో వందేళ్లు**



**కరీంనగర్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**



కరీంనగర్ టవర్ సర్కిల్‌లో జన జాగరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. గంజ్‌లోని శ్రీ వరసిద్ధి గణపతి దేవాలయంలో పూజలు నిర్వహించి, కరపత్రం మరియు ఇంటి హైందవ చైతన్యమే జగతికి శ్రీరామ రక్ష అనే పంచ పరివర్తన స్టికర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్వయంసేవకులు పలు హిందూ కుటుంబాలను కలుసుకుని సంఘం కార్యకలాపాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహక్ చామ మహేశ్వర్, వంగల పవన్ కుమార్, కళికోట మోహన్, కామరపు శశి, మాడిశెట్టి శ్రీనివాస్‌తో పాటు అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఇస్కాన భక్తులు నగర సంకీర్తన

**నల్లగొండ జిల్లా నవంబర్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
మార్గశిర మాసం మొదటి రోజు రొటీగడ్డ తాండా (నల్గొండ జిల్లా ) లో ఇస్కాన భక్తులు నగరసంకీర్తన చేపట్టారు. వీధుల్లో తిరుగుతూ హరినామ సంకీర్తనలు ఆలపించారు. కలియుగంలో ప్రతి ఒక్కరూ రోజుకు ఒక్కసారైనా హరేకృష్ణ..హరేరామ సంకీర్తన చేసుకోవడం ద్వారా ముక్తిమార్గం కలుగుతుందని యరుగండ్లపల్లి ఇస్కాన ధర్మప్రచారకులు ప్రొద్దుటూరి . రమణ దాస్ తెలిపారు. రొటీగడ్డ తాండా



నగరసంకీర్తన వీధుల గుండా భజనలు చేస్తూ, నామస్మరణ చేస్తూ సాగే ఒక ఆధ్యాత్మిక ఊరేగింపు

అంగరంగ వైభవంగా ఇస్కాన్ ప్రచార కమిటీ సభ్యులు ప్రొద్దుటూరి . రమణ దాస్, దేవేందర్ దాస్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ దాస్ మాట్లాడుతూ... సమాజంలో భక్తిని, శాంతిని, ఆధ్యాత్మికతను పెంపొందించడం దీని ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామంలో ఉన్న ప్రతీ ఇంటి నుండి భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు .

# హుజురాబాద్ అభివృద్ధికి కాంగ్రెస్ సంకల్పం- ప్రణవ్

**హుజురాబాద్, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం హుజురాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు.ప్రణవ్ పేర్కొంటూ, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఈసారి భిన్నంగా ప్రారంభించామని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా చీరలు అందజేస్తున్నామని చెప్పారు. మహిళలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. రైతుల కోసం 200 కోట్ల బోనస్ నిధులు విడుదల చేయడం, మహాలక్ష్మి పథకంలో గ్యాస్ సబ్సిడీకి 60 కోట్లు, ముస్లిం సోదరుల అభివృద్ధికి 220 కోట్లు కేటాయించడం ద్వారా మొత్తం 480 కోట్ల నిధులు మంజూరు చేశామని వివరించారు.కౌశిక్ రెడ్డి హుజురాబాద్ అభివృద్ధికి ఏం చేశాడో చర్చకు



సిద్ధమా అని ప్రశ్నిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి ఫోటో లేకుండా చెక్కులు పంచడం ప్రోటోకాల్ కాదా అని నిలదీశారు. కేసులు పెట్టడం, అధికారులను బెదిరించడం, మీడియా వారిని దాడి చేయడం వంటి చర్యల వల్లే చట్టప్రకారం కేసులు నమోదవుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.ఫార్ములా ఈ రేసింగ్ కేసులో కేటీఆర్ భయపడుతున్నాడని ప్రణవ్ విమర్శించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా 50 కోట్ల పైచిలుకు నిధులు పంపడం చట్టవిరుద్ధమని, బీఆర్ఎస్ పాలనలో స్కీముల పేరిట పెద్ద ఎత్తున స్కాములు జరిగాయని, అవి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని అన్నారు.బీజేపీ నాయకులు బండి సంజయ్, ఈటెల రాజేందర్ హుజురాబాద్ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ, రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ ఇచ్చిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి చూపుతుందని తెలిపారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేసిన ప్రణవ్, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రుణమాఫీ, రైతు భరోసా, ఆరోగ్యశ్రీ పెంపు వంటి పథకాలు ప్రజా ఆశీర్వాదం పొందాయని అన్నారు. కార్యకర్తలందరూ సమష్టిగా కృషి చేసి హుజురాబాద్‌లో అధిక సర్పంచ్ స్థానాలు గెలవాలని పిలుపునిచ్చారు.

## హిందువులు లేకుండా ప్రపంచం ఉనికే లేదు : మోహన్ భగవత్





**న్యూఢిల్లీ -నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. హిందువులు లేకుండా ప్రపంచం ఉనికే లేదని వ్యాఖ్యానించారు. ప్రపంచ మనుగడకు హిందూ సమాజం కీలకమని అన్నారు. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో పర్యటిస్తున్న ఆయన.. అక్కడ ఏర్పాటు చేసిన ఓ బహిరంగ సభలో ప్రసంగించారు.'ప్రపంచంలోని ప్రతీ దేశం అన్ని రకాల పరిస్థితులను చూసింది. యునాన్ (గ్రీస్), మిస్ర్ (ఈజిప్ట్), రోమ్ వంటి గొప్ప నాగరికతలు నశించిపోయాయి. కానీ మన నాగరికత మాత్రం ఇప్పటికీ నిలిచే ఉంది. మన నాగరికతలో ఏదో ప్రత్యేకత ఉంది, అందుకే మనం ఇంకా ఇక్కడ ఉన్నాం. భారత్ అనేది అంతంలేని నాగరికతకు పేరు. మన సమాజంలో మనం ఓ బలమైన వ్యవస్థను నిర్మించుకున్నాం. దాని కారణంగానే హిందూ సమాజం ఎప్పటికీ ఉంటుంది. హిందువులు ఉనికి కోల్పోతే.. ప్రపంచానికే ఉనికి ఉండదు. ప్రపంచ మనుగడకు హిందూ సమాజం కీలకం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## అమెరికాలో H5N5 బర్డ్‌ఫ్లూతో వ్యక్తి మృతి



**వాషింగ్టన్: -నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అరుదైన H5N 5 బర్డ్ ఫ్లూ వైరస్‌తో అమెరికాలో ఓ వ్యక్తి మరణించినట్లు తెలుస్తోంది. అయితే ఆ వైరస్ వల్ల ప్రస్తుతానికి పబ్లిక్‌కు ఎటువంటి రిస్క్ లేదని అధికారులు చెప్పారు. వాషింగ్టన్‌కు చెందిన ఆ వ్యక్తికి కొన్నాళ్లుగా ఆరోగ్యం సరిగా లేదు. H5N5 వైరస్ సోకిన తొలి అమెరికా వ్యక్తిగా అతన్ని గుర్తిస్తున్నారు. దీనిపై వాషింగ్టన్ ఆరోగ్యశాఖ ప్రకటన చేసింది.సియాటిల్‌కు 125 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రేస్ హార్బర్ కౌంటీకి ఆ వ్యక్తి చెందినట్లు చెబుతున్నారు. అతని ఇంటి వద్ద పౌల్ట్రీ ఉన్నట్లు తెలుస్తోంది. బర్డ్స్‌కు ఎక్స్‌పోజ్ కావడం వల్ల వైరస్ సోకి ఉంటుందని అనుమానిస్తున్నారు. వైరస్ పరీక్షల్లో ఏవియన్ ఇన్‌ఫ్లూయాంజా పాజిటివ్ వచ్చినవాళ్లు ఎవరూ లేరని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.వైరస్ సోకిన వ్యక్తితో కాంటాక్ట్‌లోకి వచ్చిన ప్రతి ఒక్కరినీ పరీక్షించనున్నారు. ప్రజల మధ్య వైరస్ సోకుతున్నట్లు ఆధారాలు లేవన్నారు.

## మంత్రి పదవులపై సిద్ధూ, డికే వర్గాల మొండి పట్టు..

### రంగంలోకి ఖర్గే



**న్యూఢిల్లీ -నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కర్ణాటక లో సీఎం మార్పుపై గత కొన్నాళ్లుగా సాగిన ఉత్కంఠకు తాత్కాలికంగా తెరపడినప్పటికీ.. ఇప్పుడు మరో కొత్త వివాదం మొదలైంది. సిద్ధూ క్యాబినెట్‌లో బెర్తులపై రెండు వర్గాల మధ్య సయోధ్య కుదరడం లేదు. కీలకమైన బెర్తుల కోసం రెండు వర్గాలు మొండిపట్టుతో ఉన్నాయి. దాంతో కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రంగంలోకి దిగాల్సి వచ్చింది.సీఎం మార్పుపై ఉత్కంఠ వీడటంతో డీకే వర్గం ఎమ్మెల్యేలు అధిష్ఠానాన్ని కలువకుండా మీరు ఆపుతారా..? అన్న ప్రశ్నకు డీకే బదులిచ్చారు. తాను ఆపనని కరాఖండిగా చెప్పారు. అంతేగాక సీఎం సిద్ధరామయ్యకు గుడ్‌లక్ చెప్పారు. 'సిద్ధరామయ్య ఐదేళ్లు సీఎంగా కొనసాగాలి, గుడ్‌లక్' అని పేర్కొన్నారు. ఈ క్రమంలో సిద్ధరామయ్య పార్టీ చీఫ్ ఖర్గేకు లేఖ రాశారు. క్యాబినెట్ బెర్తుల విషయంలో కన్ఫ్యూజన్‌కు తెరదించేందుకు అధిష్ఠానం జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో ఖర్గే బెంగళూరుకు చేరుకుని సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు.

## ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి వేడుకలు







**దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ మరియు మేరా యువ భారత్ నల్గొండ వారి ఆధ్వర్యంలో**

**దేవరకొండ నవంబర్ 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ మరియు మేరా యువభారత్ వారి ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాయ్స్ వద్ద ముఖ్య అతిథులు ఆర్డీవో రమణారెడ్డి , సీఐ వెంకట్ రెడ్డి , అధ్యక్షులు, ఎన్విటి ,జి. రాజేష్ మేరా భారత్ డిస్ట్రిక్ ఆఫీసర్ సభ్యులు మరియు విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఒక భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు, మరియు భారతదేశపు మొదటి ఉప ప్రధానమంత్రి. స్వాతంత్ర్యం తర్వాత, ఆయన 500కు పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారు, అందుకే ఆయనను "భారతదేశపు ఉక్కు మనిషి" అని పిలుస్తారు. ఆయన గుజరాత్‌లో జన్మించారు, ఇంగ్లాండ్‌లో బారిష్టర్ పట్టా పొందారు, మరియు గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు అని అన్నారు. విద్యార్థులు యువత మహనీయులను మరవరాదని వారి ఆశయ సాధనకై ఎప్పుడు ముందుండాలని ఈ సందర్భంగా వారు. జాతీయ సమైక్యత దేశభక్తిని పెంపొందించడం ప్రత్యేకంచి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర మరువలేనిది అని అన్నారు. తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకటేష్ , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి సుధాకర్ ,ఎం కె నాయక్ ,వి నరేందర్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ ఉమామహేష్ ,రాపోలు నిరంజన్ ,బత్తుల అమర్ , తాళ్ల సురేష్ ,ఆంజనేయులు, వంగూరు వెంకటేశ్వర్లు బో డిగ వెంకటేష్, కరాటే మాస్టర్ గోపి, ప్రసాద్ ,సంపత్, సైదా ,వలి, ఆది, శేఖర్, హరి , కృష్ణవేణి టాలెంట్ స్కూల్ రవీంద్ర భారతి ,జెడ్పి బాయ్స్ హై స్కూల్ జెడ్పి గర్ల్ హై స్కూల్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ పిఈటిలు విద్యార్థులు సిబ్బంది క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం





**వర్ధన్నపేట, నవంబర్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మృతుల కుటుంబాలను కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వర్ధన్నపేట మండలం కట్రియాల గ్రామానికి చెందిన చెంగల కుమార్, రాజు తండ్రి చెంగల రాములు గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం,మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మనోధైర్యం కల్పించారు. అనంతరం ఐనవోలు మండలం



కొండపర్తి గ్రామానికి చెందిన కాజీపేట దర్గా సొసైటీ వైస్ చైర్మన్ మాదాసి బాబు సోదరుడు మాదాసి వెంకట స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వార్త తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా వరంగల్ ఉర్సు కరిమాబాద్ కు చెందిన మంద కనకయ్య భార్య మంద పుష్ప లీల ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఈగ మల్లేశం పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రంగశాయిపేట కు చెందిన రాపాక ఉదయమ్మ అనారోగ్యం తో మృతి చెందిన వార్త తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పరామర్శించారు. ఈ కార్యక్రమం లో వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య, కరిమిళ్ల సంపత్ రావు, బొమ్మగాని శ్యామ్ గౌడ్, తిరుపతి రెడ్డి, సమ్మయ్య, ఇస్సంపల్లి బాబు,సుధీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## అమెజాన్‌లో రికార్డు స్థాయిలో లేఆఫ్స్..

40 శాతం టెకీల కోత..!




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ గత నెలలో భారీగా లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దాదాపు 14,000 మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ లేఆఫ్స్ ప్రభావం సంస్థలోని దాదాపు అన్ని విభాగాలపై పడింది. క్లౌడ్ సర్వీసెస్, డివైజెస్, రిటెయిల్, అడ్వర్టైజింగ్, గ్రాసరీస్ విభాగాల్లోని ఉద్యోగులు ప్రభావితమయ్యారు. అయితే, ఈ లేఆఫ్స్‌కు సంబంధించిన కీలక వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఆ కోతల్లో అత్యధికంగా నష్టపోయింది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లేనని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.అమెరికాలోని న్యూయార్క్, కాలిఫోర్నియా, న్యూజెర్సీ, వాషింగ్టన్ రాష్ట్రాల్లోని వర్కర్ అడ్జస్ట్‌మెంట్ అండ్ రీట్రైనింగ్ నోటిఫికేషన్ ఫైలింగ్స్ ప్రకారం.. ఆ రాష్ట్రాల్లో తొలగించిన 4,700 ఉద్యోగాల్లో దాదాపు 40 శాతం (1,800) ఇంజనీరింగ్ రోల్స్ కు చెందినవే. ముఖ్యంగా మిడ్-లెవల్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్లు ఎక్కువగా ప్రభావితమయ్యారు. ఉద్యోగుల తొలగింపుకు ఏఐ కారణం కాదని సంస్థ తెలిపింది. మరోవైపు వచ్చే ఏడాది జనవరిలో మరో రౌండ్ లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఉద్యోగుల్లో లేఆఫ్స్ గుబులు మొదలైంది. ఏ క్షణాన ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

## మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు..

### హైదరాబాద్‌లో తులం ఎంతుందంటే..



బంగారం ధరలు మళ్లీ షాకిస్తున్నాయి.. ఇటీవల కాలంలో ఏకంగా లక్షా 30 వేల మార్క్ దాటి పరుగులు పెట్టిన ధరలు.. ఆ తర్వాత తగ్గాయి.. అంతర్జాతీయంగా బంగారం ధరలు తగ్గుతుండటంతో.. ఇటీవల దేశీయంగా తగ్గాయి.. ఈ క్రమంలోనే, గోల్డ్ ధరలు మళ్లీ పెరుగుతుండటంతో పసిడి ప్రియులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా.. మళ్లీ బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ల బంగారంపై రూ.1,860 పెరిగింది. వెండి కిలోపై రూ.3వేలు పెరిగింది.

**తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..**

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,25,840 ఉండగా.. 22 క్యారెట్ల 10గ్రాముల ధర రూ.1,15,350 ఉంది.. కిలో వెండి ధర రూ.1,72,000 ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,840, 22 క్యారెట్ల ధర రూ.1,15,350 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,72,000 లుగా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,25,990, 22 క్యారెట్ల ధర రూ.1,15,500 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,64,000 లుగా ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,25,840, 22 క్యారెట్ల ధర రూ.1,15,350 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,64,000 లుగా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,26,880 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,16,300 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,72,000 లుగా ఉంది.

## తక్కువ ధరకే సరికొత్త ఇయర్ బడ్స్..



ఇయర్స్ బడ్స్‌ను ఇటీవల ఎక్కువమంది వాడుతున్నారు. సింపుల్‌గా ఉండటంతో పాటు ట్రెండీగా ఉండటంతో స్మార్ట్‌ఫోన్ ఉపయోగించేవారందరూ ఇయర్స్ బడ్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఏఐ టెక్నాలజీ, వాయిస్ అసిస్టెంట్, నాయిస్ క్యాన్సలేషన్ అంటూ అనేక ఫీచర్లతో ఇయర్ బడ్స్ వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. తాజాగా సెన్‌హైజర్ అనే కంపెనీ సౌండ్‌ప్రొటెక్ ప్లస్ ఇయర్ బడ్స్‌ను భారత్‌లో లాంచ్ చేసింది. దీని ధర ఎంత..? ఎలాంటి ఫీచర్లు ఉన్నాయి? అనే వివరాలు చూద్దాం. సాధారణంగా ట్రాఫిక్, ట్రావెలింగ్ సమయంలో డిస్టబెన్స్ వల్ల ఇయర్ బడ్స్‌లో వాయిస్ సరిగ్గా వినబడదు. కానీ సౌండ్‌ప్రొటెక్ ప్లస్ ఇయర్ బడ్స్ అలాంటి పరిస్థితుల్లో కూడా వాయిస్ క్లియర్‌గా వినిపించే ఫీచర్ తీసుకొచ్చారు. మూడు ఫిల్టర్లతో ఈ ఇయర్ బడ్స్‌ను ప్రవేశపెట్టారు. హై (20dB ), మీడియం (17dB ), లోసైండ్ ఫిల్టర్లతో ఇవి అందుబాటులో ఉన్నాయి.మెమ్బ్రేన్ ఫిల్టర్ టెక్నాలజీతో వీటిని తయారుచేశారు. ఈ టెక్నాలజీ వల్ల ట్రాఫిక్ లేదా ట్రావెలింగ్ సమయంలో ఎలాంటి డిస్టబెన్స్ లేకుండా వాయిస్ క్లియర్‌గా వినపడుతుంది. ఈ ఇయర్ బడ్స్ ధర భారత్‌లో రూ.2,990గా ఉంది. సెన్‌హైజర్ అధికారిక వెబ్ సైట్ లేదా అమెజాన్ ద్వారా ఈ ఇయర్ బడ్స్‌ను కొనుగోలు చేయొచ్చు. స్కిన్ ఫ్రెండ్లీగా వీటిని తయారుచేశామని, ఎంతసేపు పెట్టుకున్నా చెవులకు ఎలాంటి హాని ఉండదని కంపెనీ చెబుతోంది. మృదువైన, మెడికల్ గ్రేడ్ TPE నుంచి ఇవి తయారుచేశామని, రోజంతా ఉపయోగించినా ఎలాంటి ఇబ్బంది ఉండదని అంటోంది. ఇక వాటర్ రెసిస్టెంట్ కలిగి ఉన్న ఈ ఇయర్ బడ్స్‌ను స్విమ్మింగ్ చేసే సమయంలో కూడా ఉపయోగించవచ్చు. అయితే వాటర్‌లో తడిసిన తర్వాత క్లాత్ పెట్టి తుడచుకోవాలి.

# స్పోర్ట్స్

## ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్.. కొలంబోలో భారత్-పాక్ హైవోల్టేజ్ మ్యాచ్ ఈ రోజునే




వచ్చే ఏడాది ఐసీసీ టీ20 ప్రపంచకప్ జరుగనున్నది. ఈ మెగా టోర్నీ కోసం సన్నహాలు మొదలయ్యాయి. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వబోతున్నాయి. నివేదికల ప్రకారం.. టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7న ప్రారంభం కానుండగా.. మార్చి 8న ఫైనల్ జరుగుతుందని అంచనా. ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్తాన్ మధ్య హైవోల్టేజ్ మ్యాచ్ జరుగుతుందని భావిస్తున్నారు. ఫైనల్ అహ్మదాబాద్ లేకపోతే కొలంబోలో జరిగే ఛాన్స్ ఉంది. భారత్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా స్వదేశంలో జరిగే ప్రపంచ కప్‌లోకి ప్రవేశిస్తుంది. గత ఏడాది జూన్‌లో బార్బడోస్‌లో జరిగిన చివరి టీ20 ప్రపంచ కప్ టైటిల్‌ను భారత్ గెలిచింది. పాకిస్తాన్ ఫైనల్‌కు చేరుకుంటే టైటిల్ మ్యాచ్ శ్రీలంకలో జరుగుతుంది.ఐసీసీ, బీసీసీఐ, పీసీబీ మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం.. భారత్-పాకిస్తాన్ మధ్య జరిగే అన్ని మ్యాచులు 2027 వరకు తటస్థ వేదికల్లో జరుగుతాయి. ఇదిలా ఉండగా.. మెగా టోర్నీ కోసం ఇప్పటికే ఐసీసీ షెడ్యూల్‌ను ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. టోర్నీలో దాదాపు 20 జట్లు పాల్గొనున్నాయి. భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనున్న 2026 టీ20 ప్రపంచ కప్ కోసం వేదికలను ఐసీసీ షార్ట్‌లిస్ట్ చేసింది. ఇందులో భారత్‌లో ఐదు, శ్రీలంకలో మూడు వేదికలు ఉన్నాయి. ఇందులోనే ప్రపంచకప్ మ్యాచులు జరుగుతాయి. బీసీసీఐ అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయిలను జాబితాలో చేర్చించింది. శ్రీలంక కొలంబోలోని ఆర్ ప్రేమదాస, సింహలీస్ స్పోర్ట్స్ క్లబ్ క్రికెట్ గ్రౌండ్, క్యాండీలోని పల్లెకెలె అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాల్లో మ్యాచులు నిర్వహించే అవకాశం ఉంది. ఈ వేదికలను ఐసీసీ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ..

### మహ్మద్ షమీ, ఆకాశ్ దీప్‌లకు చోటు



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి బెంగాల్ జట్టును ప్రకటించింది. ఫాస్ట్ బౌలర్లు మహమ్మద్ షమీ, ఆకాశ్ దీప్‌లను జట్టులో చోటు దక్కింది. రంజీ తొలి దశలో నాలుగు మ్యాచుల్లో షమీ 20 వికెట్లు పడగొట్టాడు. పాదం గాయం నుంచి కోలుకున్న తర్వాత.. షమీ ఈ సీజన్‌లో బెంగాల్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు ఆడాడు. ఉత్తరాఖండ్, గుజరాత్‌లపై బెంగాల్ వరుసగా గెలిచిన తొలి రెండు మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. ఆకాశ్ దీప్‌తో పాటు షమీ కూడా బెంగాల్ జట్టుకు ఎంపికయ్యాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బెంగాల్ జట్టుకు అభిమన్యు ఈశ్వరన్ నాయకత్వం వహిస్తాడు. షమీ చాలాకాలంగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. సెలక్టర్లు అతన్ని తప్పించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియాతో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్, ఆ తర్వాత దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లకు షమీని జట్టులోకి తీసుకోలేదు. అయితే, దేశీయ క్రికెట్‌లో రాణించి జాతీయ జట్టులోకి రావాలని షమీ భావిస్తున్నాడు. 'రంజీ ట్రోఫీ సందర్భంగా షమీ మాట్లాడుతూ.. ఫిట్‌గా ఉండడం నా మోటివేషన్. భారత జట్టుకు అందుబాటులో ఉండడమే తప్ప.. సెలెక్టర్లకు ఫిట్‌నెస్ అప్‌డేట్స్ ఇవ్వడం తన పనికాదు' అంటూ వ్యాఖ్యానించాడు. బెంగాల్ జట్టులో రైజింగ్ ఆసియా కప్‌లో ఇండియా-ఏ తరఫున ఆడిన వికెట్ కీపర్ కం బ్యాట్స్‌మన్ అభిషేక్ పోరెల్ సైతం చోటు దక్కించుకున్నాడు. రెండవ వికెట్ కీపర్‌గా షకీర్ హబీబ్ గాంధీ సైతం ఉన్నాడు. ఈ 20 టోర్నమెంట్‌లో భాగంగా ఈ నెల 26న హైదరాబాద్‌లో బరోడాతో తమ మొదటి మ్యాచ్ ఆడనున్నారు. ఈ గ్రూప్‌లో పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, సర్వీసెస్, పుదుచ్చేరి, హర్యానా ఉన్నాయి.

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి బెంగాల్ జట్టు : అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), సుదీప్ ఘరామి, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), షకీర్ హబీబ్ గాంధీ (వికెట్ కీపర్), యువరాజ్ కేస్వానీ, ప్రియాంషు శ్రీవాస్తవ, షాబాజ్ అహ్మద్, ప్రదీప్త ప్రమాణిక్, రితిక్ ఛటర్జీ, కరణ్ లాల్, సక్షమ్ చౌదరి, మహ్మద్ షమీ, ఆకాశ్ దీప్, సయాన్ ఘోష్, కనిష్క్ సేథ్, యుధాజిత్ గుహా, శ్రేయాన్ చక్రవర్తి.

## క్రికెటర్‌గా నా ప్రయాణం మొదలైంది అక్కడే..

### మళ్లీ వెళ్తున్నందుకు సంతోషిస్తున్నా ..!




ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌కు ముందే రవీంద్ర జడేజా తన పాత జట్టుతో కలిశాడు. ట్రేడ్ డీల్ ద్వారా చెన్నై సూపర్ కింగ్స్ నుంచి అతడు రాజస్థాన్ రాయల్స్‌కు మారాడు. ఐపీఎల్ కెరీర్ ఆరంభించిన జట్టు తరఫున మళ్లీ ఆడేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని అంటున్నాడు జడేజా. ఆ ఫ్రాంచైజీతో తనకు ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయంటున్న జడ్డూ.. క్రికెటర్‌గా తన ప్రయాణం అక్కడే మొదలైందని చెబుతున్నాడు. ట్రేడింగ్ చర్చల సమయంలో తన మనసులో ఏం మెదిలిందో ఈ ఆల్‌రౌండర్ మాటల్లోనే..'నాకోసం ట్రేడింగ్ డీల్ జరుగుతున్నప్పుడు నా జర్నీ మొదలైన ఫ్రాంచైజీకి మళ్లీ ఆడాలనే ఆలోచన వచ్చింది. క్రికెటర్‌గా నా ప్రయాణం అక్కడే మొదలైంది. అప్పటి కెప్టెన్ దివంగత షేన్ వార్న్ నన్ను రాక్‌స్టార్ అని పిలిచేవారు. మళ్లీ ఆ ఫ్రాంచైజీకి వెళ్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. పదిహేనేళ్ల తర్వాత మళ్లీ రాజస్థాన్‌కు వెళ్తున్నా. అందుకే రాజస్థాన్‌కు ఆడేందుకు ఎదురుచూస్తున్నా. ప్రస్తుతం నేను క్రికెట్‌ను ఆస్వాదించే దశలో ఉన్నాను. నన్ను ప్రేమతో పిలిచేవాళ్లకు. నన్ను మనస్ఫూర్తిగా అభినందించేవాళ్లను, గౌరవించేవాళ్లను నేనెంతో ఇష్టపడుతాను' అని జడ్డూ తెలిపాడు.

**రూ.14 కోట్లకు**

ఐపీఎల్ పద్దెనిమిదో సీజన్ తర్వాత సంజూ శాంసన్ ఫ్రాంచైజీ మారాలనుకున్నాడు. అప్పటి నుంచి అతడిని ట్రేడ్ ద్వారా అమ్మేసి.. మరొకరిని తీసుకోవాలనుకుంది రాజస్థాన్. సంజూ చెన్నైకి ఆడాలని ఆశపడుతుండడంతో.. ఆ జట్టు నుంచే రవీంద్ర జడేజాను తమ గూటికి తిరిగి తెచ్చుకోవాలని రాజస్థాన్ యాజమాన్యం పావులు కదిపింది. ఫ్రాంచైజీ సహయజమాని మనోజ్ బడాలే ఫోన్ చేసి జడ్డూనే రాజస్థాన్‌కు రావాల్సిందిగా కోరాడు. కోచ్ కుమార సంగక్కర కూడా ఇదే మాట అడగడంతో.. జడేజా సరేనని అంగీకరించాడు. దాంతో.. రూ.14 కోట్లకు అతడిని రాజస్థాన్ దక్కించుకుంది. అతడితో పాటు సాయ్ కరన్‌ను కూడా అప్పగించింది సీఎస్కే.